J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS





# లాయర్

సంపుటి : 40 సంచిక : 44 2.4.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## మళ్ళీ 'లాక్‌డౌన్' కోరుకుంటున్న...

# కరోనా కోటీశ్వరులు

**కరోనా మహమ్మారి రెండవ దశ కేసులు పెరుగుతున్న తరుణంలో కొంతమంది స్వార్ధపరులు మళ్ళీ లాక్‌డౌన్ వస్తే బాగుండుననుకుంటున్నారు. ప్రజల బలహీనతను, భయాన్ని అడ్డుపెట్టుకుని కోట్ల రూపాయలు దోచుకున్న వైద్య ఆరోగ్య విభాగాలకు చెందిన కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు ఈ దుర్మార్గపు ఆలోచన చేస్తున్నారు.**




గత ఏడాది సరిగ్గా ఈ సమయానికి యావత్ ప్రపంచం లాక్‌డౌన్ అయ్యింది. రవాణా ఆగిపోయింది, లావాదేవీలు స్తంభించిపోయాయి, రహదారులన్నీ మూగబోయాయి. కరోనా మహమ్మారి దెబ్బకి సమాజం వణికిపోయింది. చిన్నా, పెద్దా, పేద, ధనిక అన్న తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలూ ఇళ్లకే పరిమితమైపోయారు. బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని జీవించారు. అంతటి స్థాయిలో కోవిడ్ భయపెట్టింది. పదులు వందలు, వందలు వేలు, వేలు లక్షలు, లక్షలు కోట్లుగా ప్రపంచ వ్యాప్తంగా కరోనా కేసులు అనూహ్యంగా పెరిగిపోయాయి. ఇదే తరుణంలో 130 కోట్ల భారత జనాభా గడగడలాడిపోయారు. కమ్యూనిటీ స్ప్రెడ్ జరిగితే వచ్చే అనర్ధాన్ని ఊహించుకోవడానికి కూడా ఎవరూ ఇష్టపడలేదు. అయితే భారతదేశంలో ఊహించిన స్థాయిలో వ్యాధి విస్తరించలేదు. అదృష్టవశాత్తు దేశం పెద్ద ప్రమాదం నుండి తప్పించుకుంది.

ఇతర దేశాలతో పాటు మన దేశంలో కూడా క్రమేణా కేసులు తగ్గుముఖం పట్టడంతో దేశం ఊపిరి పీల్చుకుంది. క్షణక్షణం భయపడుతూ నాలుగు గోడల మధ్య గడిపిన మనుషులు ఒక్కొక్కరిగా బయటకురావడం మొదలుపెట్టారు. సాధారణ పరిస్థితులు

10లో

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన 'నీలం సాహ్ని'



12లో



## తలైవాకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌కు కేంద్రం అత్యంత ప్రతిష్టాత్మకమైన 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డును ప్రకటించింది. భారతీయ చలనచిత్ర రంగంలో విశిష్ట స్థానాన్ని

10లో

## టీకాపై అపోహలు వద్దన్న ముఖ్యమంత్రి జగన్



12లో



## తిరుపతి ఎంపీ సీటుకు 33 నామినేషన్లు

తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గతనెల 30వ తేదితో ముగిసింది. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు మొత్తం 33 మంది 48 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు సమాచారం. చివరి రోజైన 30వతేది మంగళవారం నాడు 13 మంది నామినేషన్లు వేశారు. ఏప్రిల్ 3వతేది వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంది. నామినేషన్ల పరిశీలన పూర్తయ్యాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు.

## పెంచలకోనలో ఎన్నికల పరిశీలకుడు

నెల్లూరు జిల్లా రాపూరు మండలం లోని పెంచలకోనలో వెలసివున్న శ్రీ పెనుశిల లక్ష్మి నరసింహస్వామి వారిని గత నెల 30న ఎన్నికల పరిశీలకులు దినేష్ పాటిల్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ జే.వెంకట సుబ్బయ్య ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారు, అమ్మవారు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆయనకు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందజేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. రాపూరు తహసీల్దార్ శ్రీనివాసులు, డీఎస్ఓ బాలకృష్ణయ్య, వీఆర్ఓ హాజరత్తయ్య పాల్గొన్నారు.

# అంగరంగ వైభవం.. రంగనాథుని రథోత్సవం

## వేలాదిమంది భక్తులతో క్రిక్కిరిసిన రంగనాయకులపేట



నెల్లూరులో కొలువైవున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గతనెల 30న నిర్వహించిన రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవానికి వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంతం, రంగనాయకులపేట తదితర వీధులన్నీ భక్తజనసంద్రంగా మారాయి. జై రంగా! శ్రీ రంగా!..అంటూ భక్తులు పెద్దపెట్టున చేస్తున్న నామస్మరణల మధ్య జయజయధ్వానాలతో రథం కదిలింది. శోభాయమానంగా అలంకరించిన తేరులో ఉభయదేవేరులతో కలసి శ్రీ రంగనాథుడు ఆశీనుడై భక్తులకు నయనానందకరంగా దర్శనమిచ్చాడు. భక్తులు కొబ్బరి కాయలు, గుమ్మడికాయలు దిష్టి తీస్తూ కర్పూరహారతులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

తొలుత ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు శాస్త్రోక్తంగా రథానికి పూజలు చేశారు. అనంతరం స్వామివారిని, అమ్మవార్లను కన్నుల పండువగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. రథోత్సవం తూర్పు రాజగోపురం సమీపంలోని రథ మండపం వద్ద నుంచి ఉత్తర మాడవీధి, తూర్పున గోపురం వీధి, రైల్వేగేటు దాకా వచ్చి, అక్కడి నుంచి మళ్ళీ గోపురం వీధి, రంగనాయకులపేట, సంతపేటల మీదుగా నాలుగుకాళ్ళ మండపం దాకా సాగింది. ఇక్కడ స్వామివారి ఎదురుకోల ఉత్సవం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అక్కడి నుంచి ఆలయ సన్నిధి ప్రాంతానికి చేరుకుంది. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రంగనాథుని నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. ఈ వేడుకలో వైకాపా నాయకులు ముక్కాల ద్వారకానాథ్, రూప్‌కుమార్‌యాదవ్, కొణిదెల సుధీర్, వందవాసి రంగా, కుంచాల శ్రీనివాసులు, వేలూరు మహేష్, నూనె మల్లికార్జున యాదవ్, ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ శ్రీరాం వెంకటసురేష్, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## బాబోయ్ ఎండలు

ఏప్రిల్ రాకముందే ఎండలు భగ్గుమంటున్నాయి. గత నెల చివరి వారం నుంచే ఎండలు మరింత ముదిరాయి. బయటకు రావాలంటేనే జనం భయపడుతున్నారు. సోమ, మంగళవారాల్లో ఒక్కసారిగా 6 డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడంతో ఎండ వేడిమిని భరించలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. మంగళవారం రోజున గరిష్టంగా 39.9 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కావడంతో, రానున్న రోజుల్లో ఈ ఎండలు మరింతగా పెరిగిపోతాయని, ఏప్రిల్ నెల రాకముందే ఎండలు ఇంత మిడిమేళంగా ఉంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు హడలెత్తిపోతున్నారు.

## శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి హుండీ ఆదాయం 15.30 లక్షలు

నెల్లూరు నగరంలోని దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలోని హుండీలను గతనెల 30న లెక్కించగా ఈ ఏడాది జనవరి 20 నుంచి మార్చి 30వ తేది వరకు భక్తులు అమ్మవారికి కానుకలుగా సమర్పించిన మొత్తం 15,30,326 రూపాయలు వచ్చిందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఆలయ ఇ.ఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ ఛైర్మెన్ రత్నం జయరాం, ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు, పర్యవేక్షణాధికారి జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎండాకాలంలో పొంచి ఉన్న జలగండాలు

- పట్టించుకోని అధికారులు
- ఏమరుపాటులో తల్లిదండ్రులు
- ప్రతి ఏటా పెరుగుతున్న ప్రమాదాలు
- ప్రాణాలు తీస్తున్న ఈత సరదాలు



***ఎండలు మండిపోతున్నాయి. ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. సెలవు దొరికిందంటే చాలు..కాలువలు, గుంటలు ఎక్కడున్నాయో వెతుక్కుంటుంటారు పిల్లలు, యువకులు. హాయిగా ఈతకొట్టాలనే సరదా చాలామందిలో ఉంటుంది. సరిగ్గా ఇక్కడే ముప్పు పొంచి ఉంటుంది. జలగండాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి. పిల్లలు ఈ ఎండల్లో ఎక్కడికి వెళ్తున్నారో పెద్దలు ఏమరుపాటు లేకుండా ఒక కంట కనిపెట్టి ఉండాలి. అదేవిధంగా అధికార యంత్రాంగం కూడా ఈ ప్రమాదాల బారినుంచి ప్రజలను రక్షించడానికి వెంటనే భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలి. ఈత సరదాలకు పోయి ప్రమాదాలు కొనితెచ్చుకోకుండా ప్రజల్లో పెద్దఎత్తున అవగాహన కలిగించాలి.***

ప్రతి ఏటా ఎండాకాలంలో జిల్లాలో ఎన్నో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా నీటిగుంటల వద్ద, కాలువలు, చెరువులు దొరువులు, బావుల్లో ఈత కొట్టేందుకు యువకులు, పిల్లలు అనేక మంది ఎంతో ఉత్సాహం చూపుతుంటారు. స్నేహితులు కలిస్తే చాలు..అందరూ కలిసి సైగ్గా వెళ్ళిపోయి, చివరికి ప్రాణాలు మీదికి తెచ్చుకుంటూ ఉంటారు. జిల్లాలో ఇప్పటికే ఇలాంటి ప్రమాదాలెన్నో జరిగాయి. అయినా ఎవరికి వారు నిర్లక్ష్యంగా ఉండడం వల్ల ప్రతి ఏటా ఇవి పునరావృతమవుతూనే ఉన్నాయి. ఈ ఎండాకాలంలోనైనా అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే ముప్పు తప్పదు!..

### భద్రతా చర్యలు ఏవీ?..

ఎంతోమందికి ఈత సరదాయే కానీ, ఎక్కడంటే అక్కడ మునిగితే ప్రమాదాలు జరిగే అవకాశం ఎంతైనా ఉంది. కనుక ఈ ప్రమాదాలను నివారించడానికి జిల్లా అధికారయంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఇప్పటిదాకా అలాంటి చర్యలేమీ చేయకపోవడం విచారకరం. ఇకనైనా అధికారులు ఆయా గ్రామాల్లోని సిబ్బంది ఈ ముప్పును ముందుగానే గ్రహించి కాలువలు, చెరువులు దొరువుల వద్ద, బావులు, దిగుడుబావుల వద్ద, నదీ తీరాల్లోనూ, సాగరతీరాల్లోనూ భద్రతను కట్టుదిట్టం చేయాలి. ఎక్కడ నీటిగుంటలు ప్రమాదకరంగా ఉన్నాయో వాటిని గుర్తించి 'ఇక్కడ ఎవరూ దిగకూడదనే' హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేయాలి. సాధారణంగా ఈతకు దిగే ప్రాంతాలను ప్రజల ద్వారా తెలుసుకుని అక్కడంతా ముందు జాగ్రత్తలు తెలిపేవిధంగా బోర్డులు ఏర్పాటుచేయడమే కాక, ఆయా ప్రాంతాల్లో గస్తీని కూడా ఏర్పాటుచేయాలి. చెరువులు దొరువుల్లో మట్టి, ఇసుక తవ్వి భారీగా గుంటలు పడిన ప్రాంతాలు అనేకం ఉంటాయి. నీటితో ఇప్పుడు నిండిపోయిన ఆ ప్రాంతాల్లో ఎక్కడ నీటిగుంటలున్నాయో, ఎక్కడ జలగండాలున్నాయో తెలియక ప్రమాదాలు జరిగే అవకాశం ఎంతైనా ఉంది. ప్రమాదకరమైన ప్రాంతాల్లో ఈతకు దిగకూడదని గ్రామాల్లో వాడవాడలా దండోరా ద్వారా ప్రజలకు అవగాహన కలిగించాలి. బడి పిల్లలను ప్రమాదాలున్న ఆ ప్రాంతాలకు వెళ్ళకుండా చూసుకోవాలని పదేపదే ప్రజలను హెచ్చరించాలి. గ్రామాధికారులు కూడా సమావేశాలు పెట్టినప్పుడు ప్రత్యేకించి ఈత సరదాల వల్ల జరుగుతున్న ప్రమాదాలను ప్రస్తావిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తుండడం ఎంతైనా అవసరం.

### ప్రజల్లో అవగాహన కలిగించాలి

జిల్లాలో జలగండాల బారిన పడకుండా ప్రజలను రక్షించేందుకు జిల్లా అధికారయంత్రాంగం తీసుకోవాల్సిన అన్ని రకాలైన చర్యలను అధికారులు, నిపుణులతో సమావేశమై చర్చించాలి. ముఖ్యంగా ప్రమాదాలను హెచ్చరించే బోర్డులను విస్తృతంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేయడం, మైకుల ద్వారా, కరపత్రాల ద్వారా హెచ్చరించడం తదితర చర్యలతో ఈ జలగండాల నుంచి ప్రజలను కొంత వరకైనా రక్షించే అవకాశం ఉంటుంది. అంతేకాక గజ ఈతగాళ్లను కూడా అప్రమత్తంగా ఉంచుకోవడం అవసరం.

ఏదేమైనా, ఈ ఎండాకాలంలో ఈత సరదాల నుంచి, తద్వారా జరిగే ప్రమాదాల నుంచి తమ వారిని రక్షించుకునేందుకు ఆయా కుటుంబాల్లోని వారే ప్రధానంగా దృష్టి పెట్టాలి. అందుకు అధికారగణం కూడా సహకరించి భద్రతా ఏర్పాట్లను వెంటనే ముమ్మరం చేయాలి. స్వచ్ఛంధ సంస్థలు, ప్రముఖులు తదితరులంతా ప్రజల్లో ఈ ప్రమాదాల పట్ల అవగాహన కలిగించాలి. పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో ఇదెంతో ముఖ్యమని అందరూ భావించాలి. పాఠశాలల్లో అయ్యవార్లు, కళాశాలల్లో అధ్యాపకులు కాస్తంత శ్రద్ధ తీసుకుని విద్యార్థులు సరదాకు పోయి ప్రాణాలమీదికి తెచ్చుకోకుండా, ఎవరూ ఈ జలగండాల బారిన పడకుండా వారిలో అవగాహన కలిగించాలి. ఈ ఎండాకాలం రోజుల్లో ఇదెంతో అత్యవసరం కూడా!...




# స్వరాజ్య సమరస్ఫూర్తికి.. ఎగరేసిన బావుటా

- పల్లిపాడు 'పినాకిని గాంధీ ఆశ్రమానికి' నూరు వసంతాలు
- ఏప్రిల్ 6 నుంచి శతజయంతి ఉత్సవాలు

*భరతమాత దాస్యశృంఖలాలను ఛేదించేందుకు జరిగిన స్వాతంత్ర్య సమరంలో నెల్లూరుజిల్లా ఎగరేసిన బావుటాగా రెపరెపలాడింది. జాతీయ స్వాతంత్ర్య దీప్తి జ్వలనానికి అవకాశం కల్పించే ప్రతి ఉద్యమంలోనూ నెల్లూరు స్వాతంత్ర్యయోధులెందరో పాల్గొని స్వాతంత్ర్యోద్యమంలో జిల్లా కీర్తిని ఇనుమడింపజేశారు. స్వరాజ్య సమరస్ఫూర్తికి స్ఫూర్తిదీప్తిగా నిలిచిన మహాత్మాగాంధీజీ స్వయంగా జిల్లాలో అయిదుసార్లు పర్యటించారు కూడా. ఈ నేపథ్యంలో నెల్లూరుజిల్లాలోని ఇందుకూరుపేట మండలం పల్లిపాడు గ్రామంలో స్వాతంత్ర్యోద్యమానికి ప్రేరణగా బాపూజీ స్వహస్తాలతో ప్రారంభమైన ఆశ్రమం జిల్లాకే గర్వకారణం. పల్లిపాడులో పినాకిని గాంధీజీ ఆశ్రమంగా ప్రఖ్యాతిచెందిన ఈ ఆశ్రమం ఇప్పుడు నూరు వసంతల శోభతో కళకళలాడుతోంది.*

జాతిపిత మహాత్మాగాంధీజీ 1921 ఫిబ్రవరి 7న పినాకిని నదీతీరంలో ఉన్న పల్లిపాడు గ్రామంలో తన స్వహస్తాలతో ప్రారంభించిన పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం..రెండవ సబర్మతి ఆశ్రమంగా కూడా దేశవ్యాప్తంగా పేరుగాంచింది. అప్పట్లో ఈ ఆశ్రమం వెనుక ఎంతోమంది స్వాతంత్ర్య సమరవీరుల అచంచల దేశభక్తి, సేవాభావం.. అపూర్వమైన త్యాగనిరతి మిళితమై ఉన్నాయి. మహాత్మాగాంధీ చేతుల మీదుగా పినాకిని సత్యాగ్రహాశ్రమం ప్రారంభమైనప్పటి నుండి సుమారు పాతికేళ్లకు పైగా దక్షిణ భారత స్వాతంత్ర్య పోరాటానికి కేంద్ర బిందువైంది. స్వరాజ్య సమరశంఖారావాన్ని పూరిస్తూ పోరాటానికి ఊపిరులూదింది. అప్పట్లో స్వాతంత్ర సమర ఉద్యమం వైపు అడుగులు వేస్తున్న వీరవనిత పొణకా కనకమ్మ స్వాతంత్ర్యోద్యమంలో జిల్లా మహిళాలోకాన్ని కూడా ముందుకు నడిపించడమే కాక, 1918లో పల్లిపాడులో 20ఎకరాల స్థలాన్ని కొనుగోలుచేసి ఈ ఆశ్రమ నిర్మాణానికి దాతగా నిలిచారు. పల్లెపాడువాసులు దిగుమర్తి హనుమంతరావు, చతుర్వేదుల వెంకటకృష్ణయ్యల స్ఫూర్తితో ఇక్కడ ఆశ్రమం ఏర్పాటుకు నడుం బిగించారు. ఆశ్రమ నిర్మాణానికి మహాత్మా గాంధీజీ స్వయంగా జాతీయ మహాసభ నుండి పదివేల రూపాయలు సేకరించి ఇచ్చారు. దక్షిణాఫ్రికాకు చెందిన గాంధీజీ స్నేహితుడు రుస్తుంజీ మరో పదివేల రూపాయల విరాళం అందించారు. ఇలా వారందరి అండదండలు, స్వాతంత్ర్య సమరయోధుల సహకారంతో ఆశ్రమం నిర్మాణం గావించారు.

## చరిత్రాత్మకమైన రోజు :

1921 ఏప్రిల్ 7వ తేదీ ఎంతో చరిత్రాత్మకమైన రోజు. ఆరోజునే పినాకిని ఆశ్రమ భవనాన్ని మహాత్మాగాంధీజీ ప్రారంభించారు. జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోనే గర్వకారణమైన.. చిరస్మరణీయమైన సంఘటన ఇది. కుగ్రామమైన పల్లిపాడు గ్రామం..ఈ ఆశ్రమ నిర్మాణంతో, గాంధీజీ రాకతో దేశవ్యాప్త ఖ్యాతి గాంచడం ఎంతో అపురూపమైన విశేషం. నాటి నుంచి జిల్లా స్వాతంత్ర్యోద్యమానికి పల్లిపాడు కేంద్రబిందువుగా ఉంటూ జిల్లావాసులెందరినో ఉద్యమవీరులుగా తీర్చిదిద్దింది. జిల్లాలో హరిజనోద్ధరణకు మొట్టమొదటగా నడుంకట్టిన ఘనత కూడా పినాకినీ సత్యాగ్రహాశ్రమానికే దక్కుతుంది. ఇంతటి విశిష్టమైన ఈ ఆశ్రమ నిర్మాణంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లో నాటి స్వాతంత్ర్యయోధులు, దాతలు తిక్కవరపు రామిరెడ్డి, ఆయన సతీమణి సుదర్శనమ్మ, ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు బెజవాడ గోపాలరెడ్డి, పొణకా కనకమ్మ, మైపాడుకు చెందిన వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన మేనకూరు, బెజవాడ కుటుంబీకులు..ఇలా జిల్లావ్యాప్తంగా ఎందరో జాతీయవాదులు చురుగ్గా పాల్గొన్నారు. ప్రకృతి చికిత్సలో పేరున్న ఓరుగంటి వెంకటసుబ్బయ్య, ఖాసా సుబ్బారావు, ఇస్కా చెంచయ్య, రేబాల కృష్ణయ్య దంపతులు, గాంధీజీ సూచనల మేరకు ఆశ్రమ విధులు నిర్వహించేవారు. అయితే ఆశ్రమ అభివృద్ధే ధ్యేయంగా కృషిచేస్తున్న దిగుమర్తి హనుమంతరావు 1926లో మృతిచెందడంతో ఆశ్రమం దిగాలుపడిపోయింది. కాలక్రమంలో మరెందరో దాతలు, సమాజసేవకులు తామున్నామంటూ ఆశ్రమం అభివృద్ధికి ముందుకు వచ్చి సహకరిస్తుండడంతో ఆశ్రమం మళ్ళీ పూర్వవైభవాన్ని సంతరించుకుంది. ఆశ్రమ స్థల దాత, వీరవనిత పొణకా కనకమ్మ విగ్రహాన్ని నెలకొల్పితే భావితరాల వారికి స్ఫూర్తిగా ఉంటుందని భావించి నెల్లూరు మాజీఎమ్మెల్యే జెకె రెడ్డి తన సొంత నిధులతో ఆమె విగ్రహాన్ని ఆశ్రమ ప్రాంగణంలో స్థాపించారు. ఆ తరువాత కాలంలో రెడ్‌క్రాస్ సేవాసంస్థ ఈ ఆశ్రమ నిర్వహణ బాధ్యతలను స్వీకరించి నాటి స్ఫూర్తిని నేటితరానికి అందిస్తూ గాంధీజీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజలకు చేరువ చేస్తూ ముందుకు సాగుతోంది. ఈ బృహత్తర యజ్ఞంలో రాజ్యసభసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొని ఆశ్రమం అభివృద్ధికి సహకరిస్తుండడం జిల్లా ప్రజలందరి ప్రశంసలు అందుకుంటోంది. ఎంతో చరిత్రాత్మకమైన, జిల్లా కీర్తికేతనమైన పినాకిని గాంధీజీ ఆశ్రమం అభివృద్ధికి కృషి చేస్తున్న వారందరికీ ఆశ్రమం శతజయంతి ఉత్సవాల సందర్భంగా వందనాలు!... అభివందన చందనాలు!..

– ఈతకోట సుబ్బారావు
సెల్ : 9440529785

## ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన బల్లి కళ్యాణ్



బల్లి దుర్గాప్రసాద్ తనయుడు బల్లి కళ్యాణ్ చక్రవర్తి గురువారం ఉదయం తాడేపల్లిలో శాసన మండలి సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశాడు. తన మాతృమూర్తి శ్రీమతి సరళమ్మతో పాటు తన శ్రీమతి డాక్టర్ శిల్ప, పిల్లలు భవిష్య నారాయణ్, నిహిర గౌతమ, ఇతర కుటుంబసభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రమాణస్వీకారోత్సవం అనంతరం శాసనమండలి ఛైర్మెన్ షరీఫ్ మహ్మద్ అహ్మద్ కళ్యాణ్‌ను అభినందించారు.



గత నెల 30న చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో కోవిడ్ వ్యాక్సినేషన్ మొదటి డోస్ వేయించుకుంటున్న ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి

## ప్ర'జల కష్టాలు' తీర్చేందుకు...

# ప్రభుత్వం భగీరథ కృషి

- 32 పట్టణాలకు 'అమృత్' జలాలు
- రూ.8,217 కోట్లతో ప్రణాళికలు సిద్ధం

*రాష్ట్రంలో నగరాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భగీరథ కృషిచేస్తోంది. రాష్ట్ర పురపాలక శాఖ ఆధ్వర్యంలో ఇందుకోసం అమృత్, ఏఐఐబీ నిధులు, ప్లాన్ గ్రాంట్ నిధుల కింద మొత్తంగా రూ.8,216.95 కోట్లను వెచ్చించేందుకు నిర్ణయించింది. త్వరలోనే పనులు చేపట్టి పూర్తిచేసి ప్రజల దాహార్తిని తీర్చాలని, భవిష్యత్తులో రాష్ట్రంలో నీటిఎద్దడి లేకుండా చూడాలని ప్రభుత్వం తాజాగా ప్రణాళికలు సిద్ధం చేసింది.*

రాష్ట్రంలో నగరాలు, పట్టణాలు కలిపి 125 దాకా ఉండగా.. 59 పట్టణాల్లో రోజుకు ఒకసారి, 34 పట్టణాల్లో రెండు రోజులకు ఒకసారి మాత్రమే ప్రస్తుతం తాగునీటిని సరఫరా చేయగలుగుతున్నారు. ఇంకా 13 పట్టణాల్లో నీటివనరులు సక్రమంగా లేకపోవడంతో ఆ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో భవిష్యత్ తాగునీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకుని పురపాలక శాఖ ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టింది. లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న 32 మునిసిపాలిటీల్లో 'అమృత్' పథకం కింద తాగునీరు, ఇతర మౌలిక వసతుల కల్పనను ప్రభుత్వం చేపట్టింది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.3,762.91 కోట్లు కాగా, దీంట్లో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.1,056.62 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.436.97 కోట్లు ఉంది. మునిసిపాలిటీల వాటా రూ.2,088.55 కోట్లు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి, ఇతర రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులు రూ.180.77 కోట్లు సమకూరుస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆసియన్ మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల బ్యాంక్ (ఏఐఐబీ) నిధులతో మరో 50 మునిసిపాలిటీల్లో ప్రాజెక్టులు చేపట్టారు. మొత్తం 33 లక్షల జనాభాకు తాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. దీని మొత్తం వ్యయం రూ.5,350.62 కోట్లు. కేంద్ర ప్రభుత్వ వాటా రూ.3,487.67 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.1,494.72 కోట్లు కాగా మునిసిపాలిటీల వాటా రూ.368.23 కోట్లు ఉంటుంది. ఇందులో మొదటిదశ కింద ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో, రెండో దశలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్లాన్ గ్రాంట్ నిధులతో రాయచోటిలో రోజుకు 35 మిలియన్ లీటర్ల తాగునీరు అందించడంతోపాటు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కోసం రూ.340 కోట్ల ప్రాజెక్టును చేపట్టనున్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## ప్రారంభమైన త్యాగరాజ స్మరణోత్సవాలు



ప్రతి ఏడాది ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే త్యాగరాజ స్మరణోత్సవాలు ఏప్రిల్ 2 నుండి ప్రారంభమయ్యాయి. నెల్లూరు పురమందిరంలో జరుగుతున్న ఈ 56వ భిక్షాటన పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవాలు ఈనెల 9వతేదీ వరకు వైభవంగా నిర్వహిస్తారు. స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవిప్రసాద్ మాట్లాడుతూ త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ గౌరవాధ్యక్షుడిగా విఖ్యాత గాయకుడు, దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుమారుడు ఎస్పీ చరణ్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ స్మరణోత్సవాల్లో చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసుల గాత్ర కచేరీలు ప్రతిరోజు సాయంత్రం 7 గంటలకు జరగనున్నాయని, అలాగే ప్రతిరోజు ఉదయం ప్రముఖ భాగవతార్లచే హరికథా గానం ఉంటుందని, సాయంత్రం స్థానిక కళాకారులచే సంగీత కచేరీలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా స్మరణోత్సవాల ఆహ్వానపత్రికలను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

శ్రీరస్తు! శుభమస్తు!!
శ్రీశ్రీశ్రీ
ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానము



తూర్పు కనుపూరు గ్రామం, చిల్లకూరు మం., ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరుజిల్లా.
జాతర మహోత్సవ ఆహ్వానము
తేది. 06-4-2021 మంగళవారం నుండి
తేది. 09-4-2021 శుక్రవారం వరకు
కార్యక్రమ వివరములు

| | | |
|---|---|---|
| 6-4-2021 మంగళవారం | | జాతర ప్రారంభం శ్రీ పోలేరమ్మ వారి నిలుపు |
| | ఉ॥ 5.00లకు | శ్రీ అమ్మవారికి దిష్టి తీర్పు |
| | ఉ॥ 6.00 లకు | శ్రీ అమ్మవారికి వెండిచీరతో అలంకారము |
| | సా॥ 5.00లకు | శ్రీ అమ్మవారికి నెమలిచీరతో ప్రత్యేక అలంకారము |
| | సా॥ 7.00లకు | శ్రీ అమ్మవారికి సింహవాహనసేవ |
| 7-4-2021 బుధవారం | సా॥ 6.30లకు | "యార" శ్రీ గురునాథస్వామి, శ్రీ అంకమ్మ దేవతల ఉత్సవము గొల్లల వేడుకలు వివిధ రకములైన పుష్పములతో అమ్మవారికి పూలంగిసేవ |
| 8-4-2021 గురువారం | పగలు | శ్రీ గురునాథస్వామి గ్రామ ఉత్సవము |
| | సా॥6.00లకు | రాత్రి శ్రీ అమ్మవారికి ఉయ్యాలసేవ అమ్మవారికి ముత్యాలచీరతో అలంకారము |
| | రా॥ 7.00లకు | గొప్ప సినీ పాటకచ్చేరి |
| 9-4-2021 శుక్రవారం | | శ్రీ పోలేరమ్మను వెళ్ళనంపు ఉత్సవము ఉదయం 10గం.లకు దున్నపోతుల బహిరంగ వేలం |

ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమములు కలవు

భక్తజన విధేయులు...
వేమారెడ్డి మురళీమోహన్‌రెడ్డి, ఛైర్మెన్
కోవూరు జనార్ధన్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి
మరియు కమిటీ సభ్యులు

## 'ప్రభా'తం

# ఏప్రిల్ సెగ మొదలయ్యింది

**ఏప్రిల్ సెగ మొదలయ్యింది. ఇటీవలదాకా చలి, మంచుతో వణికిన ప్రజలు ఇప్పుడు ఎండల వేడితో హడలిపోతున్నారు. ఒకవైపు తిరగబెట్టిన కరోనా దేశాన్ని మళ్లీ అతలాకుతలం చేస్తోంది. మరోవైపు పలు రాష్ట్రాలు ఎన్నికల వేడితో అట్టుడికిపోతున్నాయి. ఇవన్నీ చాలవన్నట్లు సామాన్య, మధ్య తరగతి ప్రజలను ధరల వేడి మరింతగా కాలుస్తోంది. వీటన్నిటితో దేశవ్యాప్తంగా ఏప్రిల్ నెల భగ్గు భగ్గుమంటోంది. ఏప్రిల్ నెలలోనే ఇలా ఉంటే ఆ తర్వాత రోజుల్లో పరిస్థితులు ఇంకెంత ఘోరంగా ఉంటాయోనని దేశ వ్యాప్తంగా జనం హడలిపోతున్నారు.**

ఏప్రిల్ సెగ మొదలైంది. మొన్నమొన్నటిదాకా చలి, మంచుతో వణికిన ప్రజలను ఇప్పుడు ఎండల వేడి హడలెత్తిస్తోంది. కరోనా వచ్చి ఏడాది పూర్తయింది. మళ్ళీ ఇప్పుడు తిరగబెట్టిన కరోనా దేశాన్ని అతలాకుతలం చేస్తోంది. మరోవైపు పలు రాష్ట్రాలు ఎన్నికల వేడితో అట్టుడికిపోతున్నాయి. ఇవన్నీ చాలవన్నట్లు సామాన్య, మధ్య తరగతి ప్రజలను ధరల వేడి మరింతగా బాధిస్తోంది. మొత్తంగా దేశవ్యాప్తంగా ఏప్రిల్ నెల గతంలో కంటే మరింతగా మండిపోతోంది. ఏప్రిల్ నెలలోనే ఇలా ఉంటే మే నెలలో ఈ సెగలు మరింకెంతగా పెరిగిపోతాయోనని జనం భయపడిపోతున్నారు.

దేశంలో కరోనా విజృంభణ దడ పుట్టిస్తోంది. మరోవైపు ప్రభుత్వాలు కరోనా నివారణకు ప్రజలకు టీకాలు విస్తృతంగా వేస్తూనే ఉన్నా కోవిడ్ కేసులు మాత్రం వాటంతటవి పెరిగిపోతూనే ఉన్నాయి. దేశం ఈ కరోనా కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతోందని అనుకుంటున్న దశలో మళ్ళీ ఇది విజృంభిస్తుండడంతో పరిస్థితి మళ్లీ మొదటి కొస్తోంది. ఈ మాయదారి వ్యాధితో అన్ని రకాల వ్యవస్థలు మందగించిపోయి జనం సతమతమై పోతున్నారు. కరోనా సెకండ్‌వేవ్ దెబ్బతో దేశంలో ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు మళ్ళీ లాక్‌డౌన్‌ల దిశగా అడుగులు వేస్తున్నాయి. గత ఏడాది దెబ్బకే ఇంకా కోలుకోలేని పేద, మధ్యతరగతి ప్రజలు, కష్టజీవులు, వలస కార్మికులు ఇప్పుడు రెండవ కరోనా ధాటికి గగ్గోలు పెడుతున్నారు. విద్యా వైద్యం తదితర రంగాలన్నీ కుదేలైపోయాయి. చిన్నారులను బడులకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. అన్నిరకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూనే ఉన్నా కరోనా రాకాసి ఇంకా జనాన్ని చంపుకుతింటూనే ఉంది.

మరోవైపు దేశంలోని పలు రాష్ట్రాలు ఎన్నికల సెగలో కాగుతున్నాయి. ప్రచారార్భాటాలు, రంగులు మారుతున్న రాజకీయాల వేడితో ఆ రాష్ట్రాలు గత కొద్దిరోజులుగా భుగభుగమంటున్నాయి. పెద్దపెద్ద నేతలంతా ఆ బిజీలో ఉండక తప్పడం లేదు. ఇక బీదాబిక్కి ప్రజల బాధల్ని ఇంకెవరు పట్టించుకుంటారంటూ పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలు దిగాలుపడిపోతున్నారు. అందులోనూ ఈ ఏప్రిల్ నెల నుంచి ధరాభారం ఇప్పటికంటే ఎక్కువగానే ఉంటుందని నిపుణులు అంచనాలు వేస్తున్న నేపథ్యంలో సామన్యులు తమ బతుకుబండిని ఎలా నెట్టుకురావాలో, కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కాక అయోమయంలో పడిపోతున్నారు. అయితే ఈసారి సామాన్యులకే కాదు ధనికులకు కూడా ఈ ఏప్రిల్ నెల చుక్కలు చూపించబోతోంది. ఏసిలు, ఫ్రిజ్‌లు, స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, విమాన చార్జీలు అన్నీ ఇక మోత మోగించబోతున్నాయి. విమానాల ఇంధనం ధరలు భారీగా పెరిగిపోవడంతో దేశీయ విమాన ప్రయాణం మరింత భారం కానుంది. విమానఛార్జీల కనిష్ట పరిమితిని 5 శాతం పెంచాలని కూడా కేంద్రం నిర్ణయించింది. కార్లు, బైక్‌లు కొని ఝూమ్మంటూ తిరగాలనుకునేవారికి కూడా క్రమేణా ఇక ధరల బాదుడు తప్పేలా లేదు.

నిత్యావసరాలైన పాలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు అన్నీ వరసబెట్టినట్లు ఒకటొకటిగా..ఒకదానికంటే మరొకటి ఇంకా ఎక్కువ అన్నట్లుగా ధరలు పెరిగిపోతుండడంతో సామాన్యుల జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. పెట్రోధరలు, గ్యాస్ ధరలు ఆకాశంలో విహరిస్తుండడంతో మిగిలిన అన్ని రకాల వస్తువుల ధరలు ఇష్టానుసారం పెరిగిపోతున్నాయంటూ ప్రజలు లబోదిబోమంటున్నా పట్టించుకునేవారు లేరు. అసలు పెట్రోలు, డీజలు లేకుండా బతుకుబండి ఎలా కదలాలి?.. వంటగ్యాస్ లేకుండా వంట ఎలా వండుకోవాలి. లీటరు పెట్రోలు ధర దగ్గరదగ్గర వంద రూపాయల దాకా ఉంటే బండ్లు ఎలా నడుపుకోవాలి. ఎక్కడికి వెళ్ళాలన్నా వాహనాల మీద వెళ్ళేవారు ఇప్పుడు బైకు బయటకు తీయాలంటేనే ఆలోచించే పరిస్థితి ఏర్పడింది. గ్యాస్ సిలిండర్ ఒక్కనెలలోనే వంద రూపాయల దాకా పెరిగింది. అంతేకాదు, ఉప్పు పప్పు దగ్గర నుంచి నూనెల ధరల దాకా అమాంతం పెరిగిపోయాయి. వంట నూనెల ధర లీటరుకు 150 రూపాయలు దాటిపోయింది. కిలో 30 రూపాయలున్న ఎరగడ్డల ధర 50 దాకా పెరిగిపోయి సామాన్య, మధ్య తరగతి మహిళలకు నిజంగానే కంటనీరు తెప్పిస్తోంది. ఇలా వంట సామగ్రి ధరలన్నీ ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ఏది కొనాలన్నా, ఏం తినాలన్నా అందని ద్రాక్షపండ్లే అవుతున్నాయి సామాన్య జనానికి. పప్పులు ఉప్పులు నూనెలు ఇలా అన్నిటి ధరలు పెరిగిపోతుండడంతో హోటళ్లలో కూడా భోజనం ధరలు గతంలో కంటే పెరిగిపోయాయి. జనంలో ఎక్కడ విన్నా పెరుగుతున్న ధరల మాటే వినపడుతోంది. ఇటీవల పార్లమెంట్ కూడా ఈ ధరల గగ్గోలుతో వేడెక్కింది. కానీ ప్రభుత్వాలు మాత్రం ధరలను తగ్గించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోతుండడం విచారకరం. దేశంలో ధరల నియంత్రణ అనేది ఎప్పుడో కాలగర్భంలో కలసిపోయినట్లుంది. ఇలా ఇంకెంతకాలమో చెప్పలేం అంటున్నారు అనుభవజ్ఞులు.

ప్రభుత్వాలు ఇకనైనా ఈ ధరల విషయంపై దృష్టి పెట్టాలి. సామాన్యులతో పాటు అన్ని వర్గాల ప్రజలు తమ జీవితాలను సాఫీగా గడుపుకునేలా ధరలను నియంత్రించాలి. దేశంలోని ప్రతిచోటా ధరల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు అన్నిరకాల వస్తువులు, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించేందుకు శాశ్వత ప్రాతిపదికపై తక్షణ చర్యలు చేపట్టాలి. సామాన్యులతో పాటు ప్రజలందరినీ ధరాభారాల నుంచి విముక్తుల్ని చేసేందుకు ప్రభుత్వాలు సత్వరం సంకల్పించాలి. ఆ బృహత్తర యత్నం కూడా ఈ ఏప్రిల్ నుంచే మొదలుకావాలని అందరం కోరుకుందాం!...

## దువ్వూరు ఘటన మరువకముందే...

# దామరమడుగు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

◆ ఎనిమిది మంది మృత్యువాత ◆ విషాదంగా మారిన తీర్థయాత్ర



***పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలని తమిళనాడు ప్రాంతం నుంచి ఎంతో భక్తి శ్రద్ధలతో ఇక్కడికి వచ్చిన వారు తమ యాత్ర పూర్తిచేసుకుని మరికొద్ది సేపట్లోనే గమ్యానికి చేరుకుంటారనగా, మృత్యువు వారిని వెంటాడింది. అర్ధరాత్రి సమయంలో వేగంగా వెళ్తున్న వారి వాహనం ఒక లారీని ఢీకొంది. గాఢనిద్రలో ఉన్న వారంతా ఉలిక్కిపడి లేచేలోగానో ఘోరం జరిగిపోయింది. టెంపో డ్రైవర్‌తో సహా ఎనిమిది మంది ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోయాయి. మరి కొంతమంది గాయపడ్డారు. జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు వద్ద ఈ దుర్ఘటన జరిగింది.***

తమిళనాడులోని పెరంబూరు సమీపంలోని ఆగరం గ్రామానికి చెందిన 15 మంది బంధువులంతా కలసి పలు పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు రైల్లో వచ్చి, నెల్లూరులో ఒక టెంపో వాహనం మాట్లాడుకున్నారు. నాలుగురోజుల పాటు పలు పుణ్యక్షేత్రాలను పర్యాటక ప్రాంతాలను దర్శించుకున్నారు. నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలోని పలు ఆలయాలను దర్శించుకుని గతనెల 27వతేది శనివారం రాత్రి వారు నెల్లూరుకు తిరుగుప్రయాణమయ్యారు. ఆదివారం ఉదయం 10 గంటలకు వారంతా తిరిగి రైల్లో చెన్నైకి బయలుదేరాల్సి ఉంది. మరి కొద్దిసేపట్లోనే వారు నెల్లూరుకు చేరుకుంటారనగా, బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగు వద్ద రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని టెంపో వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో టెంపోలో ఉన్నవారిలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. సమాచారం తెలిసిన వెంటనే సిఐ సురేష్ బాబు, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై విచారించారు.

### మిన్నుముట్టిన హాహాకారాలు

ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా హాహాకారాలు మిన్నుముట్టాయి. టెంపో నుజ్జునుజ్జయిపోయింది. అర్ధరాత్రి కావడం, టెంపో డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం, పొగమంచు వ్యాపించి ఉండడం, ఆ చీకటిలో దారి సరిగా కనిపించకపోవడం ఈ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వ్యానులో మొత్తం 16 మంది ప్రయాణిస్తుండగా అందులో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని, ఒక మహిళను ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందారని పోలీసులు తెలిపారు. మిగిలిన వారికి గాయాలయ్యాయని, మరో ఇద్దరు చిన్న పిల్లలు ఎలాగో ప్రాణాలతో బయటపడ్డారని పేర్కొన్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న నెల్లూరులోని వారి బంధువులు అక్కడికి చేరుకుని మృతుల వివరాలను పోలీసులకు తెలియజేశారు.

జిల్లాలోని తోటపల్లి గూడూరు మండలం కోవెరపాళెంకు చెందిన దామరమడుగు రేవతికి ఆగరం ప్రాంతానికి చెందిన వ్యక్తితో వివాహం కావడంతో అక్కడ స్థిరపడిందని, పుణ్యక్షేత్రాల సందర్శన యాత్రలను ఆమె నిర్వహిస్తున్న నేపథ్యంలో చెన్నైలోని తన బంధువులందరితో కలసి ఈ యాత్ర చేపట్టినట్లు తెలుస్తోందని వారు పేర్కొన్నారు.

### మృతుల బంధువుల రోదనలు

ఈ దుర్ఘటనలో చెన్నై సమీపంలోని ఆగరం ప్రాంతానికి చెందిన నందకుమార్, నందకుమార్ పద్మిని, మణిరత్నం జగదీష్, సాయికృష్ణన్ సుజాత, సుబ్రహ్మణ్యం సద్గుణదేవి, వసంత్ ఆషా, దామరమడుగు రేవతితో పాటు టెంపో డ్రైవర్ నెల్లూరుకు చెందిన నల్లపరెడ్డి గుర్నాథ్‌రెడ్డి దుర్మరణం పాలయ్యారు. మృతుల బంధువుల రోదనలతో ఆ ప్రాంతమంతా విషాదమయంగా మారింది. మార్చురీ వద్ద మృతదేహాలను జిల్లా జాయింట్ కలెక్టర్లు హారేందిరప్రసాద్, ప్రభాకర్‌రెడ్డితో పాటు ఆర్డీఓ తదితర అధికారులు, పోలీసు అధికారులు పరిశీలించి మృతుల బంధువులను ఓదార్చారు. ఈ దుర్ఘటన జిల్లా వాసులను కలచివేసింది. తీర్థయాత్రలకని వచ్చి ఇలా దుర్మరణం పాలుకావడంతో మృతుల కుటుంబాల్లో ఈ ఘటన అంతులేని విషాదాన్ని మిగిల్చింది.

## ఈ రోడ్డుప్రమాదాలకు అంతే లేదా?

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతూనే ఉన్నాయి. రోజూ ఎక్కడో ఒక చోట ఏదో ప్రమాదం జరుగుతూనే ఉంది. ఇటీవల సంగం మండలంలోని దువ్వూరు దగ్గర, మొన్న బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామవరం దగ్గరా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మరణించడం ఎంతో బాధాకరం. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనాలు నడిపేవారు వేగంగా నడపడమో, అజాగ్రత్తగా ఉండడమో వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. వేగం, నిద్ర సరిగా లేకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ముఖ్యంగా రోడ్లపై మలుపుల వద్ద జాగ్రత్తగా వాహనాలు నడుపుకోవాలి. ఎంతో జాగ్రత్తగా వాహనాలు నడిపితే తప్ప సక్రమంగా గమ్యం చేరుకోలేం. ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో చెప్పలేం. ఇకనైనా వాహనాలు నడిపేవారు జాగ్రత్తగా నడపాలి. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి.

**– ఎం.బ్రహ్మయ్య, జొన్నవాడ.**

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# నెల్లూరులో నామినేషన్ల సందడి

**తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికకు సంబంధించి నెల్లూరులో నామినేషన్ల సందడి నెలకొంది. గతనెల 29న మంచి ముహూర్తం కావడంతో పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే టిడిపి అభ్యర్థిగా పనబాక లక్ష్మి నామినేషన్ వేసి ఉండగా, 29వ తేదిన వైకాపా అభ్యర్థిగా డాక్టర్ గురుమూర్తి, బిజెపి తరఫున రత్నప్రభ, కాంగ్రెస్ పార్టీ తరఫున చింతా మోహన్, సిపిఎం అభ్యర్థి యాదగిరి తమ నామినేషన్లు వేశారు. వీరితో పాటు పలు పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. దీంతో గతనెల 29వ తేది నాటికి 18 మంది తమ నామినేసన్లు దాఖలు చేసినట్లయింది.**





## వైకాపా అభ్యర్థిగా డాక్టర్ గురుమూర్తి :

తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికలకు సంబంధించి గతనెల 29వ తేది సోమవారం మంచి ముహూర్తం కావడంతో నెల్లూరులో నామినేషన్ల సందడి నెలకొంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డాక్టర్ ఎం.గురుమూర్తి నామినేషన్ వేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కెవిఎన్ చక్రధర్ బాబుకు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, వైకాపా నేత, టిటిడి బోర్డు ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, మంత్రులు పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డి, డాక్టర్ పోలుబోయిన అనిల్ కుమార్‌తో వచ్చి గురుమూర్తి అట్టహాసంగా తన నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు వేలాదిగా వైకాపా అభిమానులు, నాయకులు అందరూ తరలిరావడంతో నెల్లూరు నగరంలో రాజకీయ కోలాహలం ఏర్పడింది. నెల్లూరు, చిత్తూరు జిల్లాల నుంచి పార్టీ అభిమానులు స్వచ్ఛందంగా రావడంతో నగర వీధులన్నీ కిటకిటలాడాయి. ఈ సందర్భంగా నామినేషన్ వేయడానికి ముందు నెల్లూరు నగరంలోని వైకాపా కార్యాలయంలో దివంగత మహానేత డా.వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత జరిగిన సమావేశంలో టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డి, మంత్రులతో పాటు ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వెలగపల్లి వరప్రసాద్, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి, నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి నగరంలోని విఆర్‌సి సెంటర్‌లో ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైకాపానేత, చిత్తూరుజిల్లా పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి, టిటిడి బోర్డు ఛైర్మెన్ వైవి సుబ్బారెడ్డితో పాటు మంత్రులు బాలినేని శ్రీనివాసులురెడ్డి, నారాయణస్వామి, ఆదిమూలపు సురేష్, డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్, మేకపాటి గౌతంరెడ్డి, కొడాలి నాని తదితరులతో కలిసి వైకాపా అభ్యర్థి గురుమూర్తి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్ళి కలెక్టరేట్‌లో డాక్టర్ గురుమూర్తి తన నామినేషన్ దాఖలు చేశారు.

## బిజెపి అభ్యర్థిగా రత్నప్రభ

భారతీయ జనతాపార్టీ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి రత్నప్రభ సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లో తన నామినేషన్ దాఖలు చేశారు. బిజెపి రాష్ట్ర నాయకులు, రాజ్యసభ సభ్యుడు జివిఎల్ నరసింహారావు, సిఎం రమేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ యాదవ్ తదితరులతో కలసి ఆమె కలెక్టరేట్ వద్దకు ర్యాలీగా వచ్చారు.

## కాంగ్రెస్ అభ్యర్థిగా చింతా మోహన్

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాజీ ఎంపి చింతా మోహన్ సోమవారం తన నామినేషన్ వేశారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా వచ్చి ఆయన తన నామినేషన్ వేసి వెళ్ళారు.


## సిపిఎం అభ్యర్థిగా యాదగిరి :

ఈ ఎన్నికల్లో సిపిఎం పార్టీ అభ్యర్థిగా నెల్లూరు యాదగిరి సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు, జిల్లా నాయకులు చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, సిపిఐ రాష్ట్ర నాయకుడు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు :

సోమవారం మంచిరోజు కావడంతో పలువురు తమ పార్టీల తరఫున, మరి కొందరు స్వతంత్ర అభ్యర్థులుగా కూడా తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఏఎన్‌పి తరఫున కె.శ్యామ్‌థన్, ప్రజాబంధు పార్టీ తరఫున పల్లె నాగరాజు, నవతరం పార్టీ తరఫున గోదా రమేష్, మహాజన రాజ్య పార్టీ తరఫున సంగటి మనోహర్‌లు ఎలాంటి ఆర్భాటాలు లేకుండా వచ్చి తమ నామినేషన్లు దాఖలు చేశారు. అదేవిధంగా స్వతంత్ర అభ్యర్థులుగా పి.రాజ, చింతమాకుల పుణ్యమూర్తి, వెంకటేశ్వరస్వామి, తాటిపత్రి బాబు తమ నామిషన్లు వేశారు.

# మళ్ళీ కరోనా తిరగబెడుతోంది




- నిర్లక్ష్యం చేశారో.. కాటు తప్పదు
- టీకా ఒక్కటే మనకు రక్షణ

జిల్లాలో కరోనా సెకండ్‌వేవ్‌తో తిరగబెడుతోంది. తగ్గిపోయిందిలే అనుకున్న ఈ మహమ్మారి ఏమాత్రం తగ్గకపోగా మరింతగా పెరుగుతూ తన విశ్వరూపం చూపుతోంది. కంటికి కనిపించకుండానే ఎంతోమందిని కబళిస్తోంది. రోజురోజుకీ కరోనా కేసులు పెరుగుతుండడంతో జిల్లా ఉన్నతాధికారులు ఈ వ్యాధి నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు కూడా ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా కరోనా పట్ల అప్రమత్తంగా ఉండడం ఎంతో ముఖ్యం. అందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. గుంపులు గుంపులుగా రోడ్లపైనా, మార్కెట్ల వద్దా తిరగకుండా సామాజిక దూరం పాటించాలి. చేతులను తరచూ సబ్బుతో శుభ్రం చేసుకుంటూ, శానిటైజర్లను వినియోగిస్తూ ప్రభుత్వాలు చెప్పిన్న నియమ నిబంధనలను పాటిస్తూ అందరూ కోవిడ్ వైరస్‌కు దూరంగా ఉండాలి. మరీ అత్యవసరమైతే తప్ప వీధుల్లోకి రాకపోవడం ఎంతైనా మంచిది. కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ జిల్లా అధికారులు, వైద్యబృందాలు, పోలీసులు అందరూ రోజూ పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రతి ప్రాంతంలోనూ అవగాహన సదస్సులు పెడుతూనే ఉన్నారు. ఆ నియమాలను పాటించాలి. తద్వారా మన ప్రాణాలను మనమే కాపాడుకోవాలి. కరోనా కేసులు మళ్ళీ పెరుగుతూనే ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోకుంటే కరోనా కాటు తప్పదు. గత నెల 29న ఒక్కరోజే 2157 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తే వారిలో 84 మందికి కరోనా వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయిందంటే కరోనా మళ్ళీ ఎంతగా వ్యాపిస్తూ ఉందో అర్థమవుతుంది. ఈ మాయదారి వ్యాధి మరింతగా విజృంభించి ప్రమాదకరం కాకముందే అందరూ జాగ్రత్తపడాలి. కరోనా వ్యాక్సిన్ కూడా అందుబాటులోకి వచ్చేసింది కనుక ప్రజలు తప్పనిసరిగా వాక్సిన్ వేయించుకుని కరోనాను తరిమికొట్టాలి. ఇప్పటికే జిల్లాలో రోజూ వేలాదిమంది టీకా వేసుకుంటూనే ఉన్నారు. గత కొద్దిరోజులుగా టీకా వేసుకునేవారి సంఖ్య బాగా పెరుగుతూనే ఉండడం సంతోషకరం. టీకా వేసుకున్నవారంతా ఎంతో ఆరోగ్యకరంగా ఉన్నారు. టీకాపై ఎవరూ ఎలాంటి అపోహలు అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు. మన ఆరోగ్యానికి అత్యంత సురక్షితమైనది, కరోనా మాయదారి వ్యాధి నుంచి మనల్ని రక్షించేది.. కరోనా టీకా ఒక్కటే అని అందరూ గుర్తించాలి. ఎవరో ఏదో చెప్తున్నారని, టీకాపై లేనిపోని అనుమానాలు పెట్టుకోకుండా, అనవసరమైన దుష్ప్రచారాలను నమ్మకుండా ప్రజలంతా విచక్షణతో విజ్ఞతతో వ్యవహరించాలి. కరోనా బారిన పడకుండా ఉండాలంటే.. ఇంతకంటే సదవకాశం లేదు.. ఇంక రానే రాదు. కనుక వెంటనే ప్రజలు అప్రమత్తం కావాలి. కరోనాకు..టీకా ఒక్కటే దివ్యౌషధం కనుక తమప్రాంతాల్లో ఎక్కడ కోవిడ్ టీకా వేస్తున్నారో వెంటనే తెలుసుకుని అందరూ టీకా వేయించుకోవాలి. లేకుంటే కరోనా ముప్పు తప్పదు. ఆ తర్వాత ఎంతగా విచారించినా ప్రయోజనం ఉండదు. తస్మాత్ జాగ్రత్త!...

## నిరుపేద కుటుంబాన్ని
# ఆదుకున్న ఎమ్మెల్యే ప్రసన్న

**నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 50వేల సాయం**



ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు బీసీ కాలనీలో ఉన్న నిరుపేద పి.వైదేహి కుటుంబంలో వారి పిల్లల చదువు కోసం కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇటీవల 50 వేల రూపాయలు ఆర్థికసాయంగా అందించారు. నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నెల్లూరులోని తన నివాసంలో ఎమ్మెల్యే ప్రసన్న ఆమెకు ఈ సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, కైలాసం శ్రీనివాసులురెడ్డి, లేబూరు వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తమ కుటుంబాన్ని ఆదుకున్న ఎమ్మెల్యే ప్రసన్నకు వైదేహి తన కృతజ్ఞతలు తెలిపారు.





# నేత్రపర్వం.. రంగనాధుని కల్యాణోత్సవం

**తిరుమల తిరుపతి దేవస్థానాల తరపున పట్టువస్త్రాలు సమర్పించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నెల్లూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాధస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గతనెల 29వ తేది సోమవారం నాడు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాల పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ ఇఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివార్ల తీర్థప్రసాదాలను అందజేశారు. తొలుత స్వామి వార్లకు కన్నుల పండువగా పూలంగి సేవ జరిగింది. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి జగన్నాధాచార్యులు, నిండ సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివార్ల కల్యాణమహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తర్వాత రాత్రి ఒంటిగంట సమయంలో స్వామివారికి గజవాహనోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# తెలుగువారి ఆత్మగౌరవం.. ఎన్టీఆర్

**- టిడిపి ఆవిర్భావ దినోత్సవంలో బీద రవిచంద్ర**



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అంటూ తెలుగుదేశం పార్టీని స్థాపించి ప్రజలకు ఎనలేని సేవలందించిన దివంగత నేత ఎన్టీరామారావు ప్రజలందరికీ చిరస్మరణీయుడని, తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్ నిలిచారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కొనియాడారు. గతనెల 29న నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో టిడిపి 40వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బీద మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయసాధనే లక్ష్యంగా అందరం ముందుకు సాగాలని, చంద్రబాబు నాయకత్వంలో ప్రతి కార్యకర్త సైనికునిలా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఆయన టిడిపి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి, జెన్ని రమణయ్య, రంగారావు, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, పనబాక భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దోర్నాలవీధిలో దొంగలుపడ్డారు

నెల్లూరు నగరం, దోర్నాలవీధిలోని ఒక ఇంట్లో దొంగలు పడి పోపుల డబ్బాలో దాచుకుని ఉన్న బంగారు నగలు ఎత్తుకుపోయారు. ఒంట్లో బాగాలేక ఆసుపత్రికి వెళ్లివుంటే ఇదే సందని దొంగలొచ్చి ఇల్లు గుల్లచేసి పోయారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. దోర్నాలవీధిలో ఉన్న రాఘవులు దంపతులు నాలుగురోజుల కిందట చికిత్స కోసం చెన్నైకి వెళ్లారు. ఇదే అదనుగా గుర్తుతెలియని దుండగులెవరో వచ్చి ఇంటి తాళాలు పగులగొట్టి ఇల్లంతా గాలించారు. వంట గదిలో పోపుల డబ్బాలో దాచిపెట్టి ఉన్న సుమారు 6 లక్షల విలువజేసే 21 సవర్ల బంగారు నగలను దొంగిలించుకుపోయారు. ఇంటి తలుపులు తెరచివున్నాయని గమనించిన స్థానికులు రాఘవులుకు ఫోన్లో తెలియ జేయగా, ఆయన తన బావమరిది వెంకటేశ్వర్లుకు సమాచారం అంద జేశారు. ఈ చోరీపై ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్స్పెక్టర్ అన్వర్‌బాషా సిబ్బందితో వచ్చి ఇంటిని పరిశీలించారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ ద్వారా సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## నెల్లూరు కబుర్లు

**వీడియో కాన్ఫరెన్స్ హాల్‌కు..**

# ఎస్ఆర్ శంకరన్ పేరు

**కలెక్టర్ చక్రధర్‌బాబు**



నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో కొత్తగా ఆధునీకరించిన వీడియో కాన్ఫరెన్స్ హాల్‌కు గతంలో ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషిచేసిన ఎస్ఆర్ శంకరన్ పేరును పెడుతున్నట్లు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. దీంతో ఎస్ఆర్ శంకరన్‌కు సముచిత గౌరవం ఇచ్చినట్లయింది. గత నెల 29న ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ దివంగత కలెక్టర్ శంకరన్ సేవలు ఐఏఎస్ అధికారులకు మార్గదర్శకమని ప్రస్తుతించారు. ఆధునీకరించిన వీడియో కాన్ఫరెన్స్ హాల్‌కు ఆయన పేరు పెట్టడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్లు హరేందిర ప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, జేసీ ఆసరా బాపిరెడ్డి, జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్, ఆర్డఓ హుస్సేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆహార కల్తీపై జేసీ ఆగ్రహం

**--- కల్తీ వ్యాపారులకు 39వేల జరిమానా ---**

జిల్లాలో ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్న పలువురు కల్తీ వ్యాపారుల తీరుపై జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దాడులు చేసి ఆహారపదార్థాల కల్తీకి సంబంధించిన కేసులను నమోదు చేసి జేసీ కోర్టుకు బదిలీ చేయగా, ఆ కేసులను ఇటీవల నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తన చాంబర్‌లో జేసీ విచారించారు. 19 కేసులను విచారించారు. ఈ సందర్భంగా కల్తీ వ్యాపారులకు జేసీ 39,400 రూపాయలను జరిమానాగా విధించారు. ఆహార పదార్థాలను కల్తీచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్లు డాక్టర్ కె.షమీమ్‌బాషా, కె.చంద్రశేఖర్, కె.నర్మద, డి. నీరజ పాల్గొన్నారు.

**విఎస్‌యుపై..**

# లేనిపోని ఆరోపణలు చేయొద్దు



విక్రమసింహపురి యూనివర్శిటీ (విఎస్‌యు)లోని పరీక్షల విభాగం నిర్వహణ అధికారిని లక్ష్యంగా చేసుకుని కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, ఆ ఆరోపణలన్నీ నిరాధారాలని, సత్యదూరమైనవని విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఆరోపణలు చేసేవారు ఆధారాలతో సహా వస్తే తప్పకుండా విచారణ చేసి బాధ్యులపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఒక విద్యార్థి ఉత్తీర్ణతకు సంబంధించి వచ్చిన ఆరోపణలను ఆయన ప్రస్తావిస్తూ ఆ విద్యార్థి విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని పరిశీలనలో తేలిందన్నారు. సాంకేతికంగా జరిగిన పొరపాటును కూడా పరీక్షల విభాగం గుర్తించి సరిచేసిందని, ఆ విద్యార్థికి ప్రమేయం లేకుండానే ఉత్తీర్ణతను ప్రకటించడం జరిగిందని ఆయన పేర్కొంటూ ఈ విషయాలన్నీ విఎస్‌యు వెబ్‌సైట్‌లో పొందుపరచడం కూడా జరిగిందని వివరించారు. వాస్తవం ఇలా ఉండగా విఎస్‌యు రీవాల్యుయేషన్ ఫలితాల్లో పెద్దఎత్తున సొమ్ములు చేతులు మారాయంటూ ఆరోపణలు చేయడం సముచితం కాదన్నారు. ఎందరికో విద్యనందిస్తున్న విఎస్‌యు ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నాలు చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎస్పీ సేవలు.. మార్గదర్శకం



- వాహనదారులకు స్వయంగా మాస్కులు తొడిగారు
- కరోనా నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు

జిల్లాలో మళ్లీ కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో కేవలం ప్రకటనలిచ్చి సరిపెట్టకోవడమే కాకుండా స్వయంగా జిల్లా ఎస్పీయే రంగంలోకి దిగారు. నగర వీధుల్లోకి వచ్చి మాస్కులు ధరించకుండా వాహనాల్లో వెడుతున్న వారిని ఆపి, వారికి మాస్కులు తానే స్వయంగా తొడిగారు. కరోనా నివారణకు ప్రభుత్వ నిబంధనలు ఎలా పాటించాలో వారికి పదేపదే తెలియజెప్పారు. జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ సేవలు చూసిన నగర ప్రజలు ఆయన్ను ఎంతగానో అభినందిస్తున్నారు. గతంలో కూడా జిల్లా పోలీసులు కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి ఎంతగా సేవలు చేశారో ప్రజలందరికీ విదితమే. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా కరోనా ముప్పు ముంచుకొస్తున్న పరిస్థితుల్లో జిల్లా ఎస్పీతో పాటు జిల్లా పోలీసులు వీధుల్లోకి వచ్చి మాస్కులు లేకుండా తిరుగుతున్న వారి చేతులను శానిటైజ్ చేసి, మాస్కులు తొడిగారు. ఆటోల్లో మాస్కులు లేకుండా వెళ్తున్నవారికి కూడా మాస్కులు అందజేశారు. కరోనా కనుమరుగైపోయిందని ఎవరూ అనుకోవద్దని, కరోనా మహమ్మారి ఇంకా తొలగిపోలేదని, ప్రజలు నిర్లక్ష్యం వహించకుండా కోవిడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ కరోనా బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోవిడ్ నిబంధనలు పాటించనివారిపై ఇకనుంచి చర్యలు తప్పవని కూడా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ పి.వెంకట రత్నం, నగర, ట్రాఫిక్ డిఎస్పీలు జె.శ్రీనివాసులురెడ్డి, మల్లికార్జునరావు, ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, వేమారెడ్డి, అన్వర్‌బాషా, నాగేశ్వరమ్మ, రామకృష్ణ, మంగారావు, ఆర్ఐ శ్రీకాంత్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఇలా ఒక్క నెల్లూరు నగరంలోనే కాక జిల్లా ఎస్పీ ఆదేశాలతో గత నెల 27న జిల్లావ్యాప్తంగా పోలీసు యంత్రాంగ కరోనా నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించడం అభినందనీయం.

# మంచిగా మెలగండి

**- రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సిలింగ్**



రౌడీషీటర్లు ఇకనైనా సత్ప్రవర్తనతో మెలగాలని, మంచిగా ఉంటూ సమాజంలో మంచిపేరు తెచ్చుకోవాలని పోలీసులు హితవు చెప్పారు. గతనెల 28న నెల్లూరు నగరంలోని ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అల్లర్లకు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర ఇన్‌స్పెక్టర్ మధుబాబు, వేమారెడ్డి, అన్వర్‌బాషా, నాగేశ్వరమ్మ, రామకృష్ణ, మంగారావు తదితరులు పాల్గొన్నారు.

# రామ్‌చరణ్ అభిమానుల రక్తదానం



ప్రముఖ సినీనటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గత నెల 27న నెల్లూరులో రామ్‌చరణ్ అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. తొలుత రామ్‌చరణ్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు సుజయ్‌బాబు, ప్రశాంత గౌడ్‌ల ఆధ్వర్యంలో కేకు కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేసి పలువురు రక్తదానం చేశారు. రామ్‌చరణ్ అభిమానుల సంఘం నాయకులు గునుకుల కిషోర్, శ్రీనివాసులురెడ్డి, కందికట్టు మల్లి, వినయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## బిట్రగుంట కొండపై
# వై.వి.సుబ్బారెడ్డి దంపతులు
### స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పట్టువస్త్రాల సమర్పణ

బోగోలు మండలం కొండ బిట్రగుంటలో వెలసి ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత నెల 28వ తేదీన జరిగిన స్వామివారి కళ్యాణోత్సవంలో టిటిడి బోర్డు ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కావలి ఎమ్మెల్యే ఆహ్వానం మేరకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వారు విచ్చేసి స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కొండ బిట్రగుంట ఆలయ అభివృద్ధికి చేపట్టిన ప్రణాళికలను వైవి సుబ్బారెడ్డికి వివరిస్తూ.. అందుకు తగు చేయూత నివ్వాలని విజ్ఞప్తి చేశారు. నారద మహర్షి కోరిక మేరకు శ్రీ వేంకటేశ్వరస్వామి ఈ బిలకూట క్షేత్రంలో కొలువయ్యారని పురాణ ప్రాశస్త్యం ఉందని, ఇంతటి విశిష్టత కలిగిన ఈ ఆలయాన్ని రెండవ తిరుమలగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసి ఛైర్మెన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డి, ఆప్కాఫ్ ఛైర్మెన్ కొండూరు అనిల్‌బాబు, వైకాపా నాయకులు ఎం.వీరరఘుయాదవ్, తాళ్ళూరు ప్రసాద్‌నాయుడు, కనుమర్లపూడి వెంకటనారాయణ, కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పెన్నానదిపై..
# త్వరలోనే మరో వంతెన నిర్మిస్తాం
### నెల్లూరును నందనవనం చేస్తాం - మంత్రి డా.అనిల్



రోజురోజుకీ ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న దృష్ట్యా పెన్నానదిపై త్వరలోనే మరో వంతెన నిర్మిస్తామని, నెల్లూరు నగరాన్ని గత ప్రభుత్వంలో వలె మాటలతో కాకుండా, చేతలతో అభివృద్ధి చేసి చూపుతామని, నగరాన్ని నందనవనంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు.

గత నెల 27న ఆయన నెల్లూరు నగర నియోజకవర్గంలోని 13వ డివిజన్ వేప దొరువు తదితర ప్రాంతాల్లో అధికారులు, నాయకులతో కలసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనిల్ మాట్లాడుతూ ఎక్కడికక్కడ ప్రజల సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశించారు. పెన్నానదిపై మరో వంతెన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా 12వేల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే 6వేల మొక్కలకుపైగానే నాటడం జరిగిందని, మిగిలిన వాటిని కూడా త్వరలోనే నాటి పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరం పచ్చదనంతో కళకళలాడేలా ఉండాలన్నదే తమ ధ్యేయమన్నారు. చెత్తను శుభ్రపరిచేందుకు సుమారు 50 కోట్ల రూపాయల వ్యయంతో యంత్రాలను కూడా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. సర్వేపల్లి కాలువ ఆధునీకరణ పనులు త్వరలోనే మొదలు పెట్టి వేగవంతంగా పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మరో ఏడాదిలోగానే నెల్లూరును సుందర సింహపురిని చేస్తామని, నెల్లూరు నగరంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. మంత్రితో పాటు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఊటుకూరు నాగార్జున, కర్తం ప్రతాప్‌రెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, తుమ్మల కొండారెడ్డి, నెల్లూరు సుబ్బారెడ్డి, తుమ్మల శంకర్‌రెడ్డి, శేషు, షేక్‌మహబూబ్, ఎన్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## దువ్వూరులో బాధిత కుటుంబాలను
# ఓదార్చిన మంత్రి గౌతంరెడ్డి

ఇటీవల సంగం మండలం, దువ్వూరు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలను గతనెల 28న రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి పరామర్శించి ఓదార్చారు. రోడ్డుప్రమాద ఘటనలో ఆరుగురు మృతిచెందడం బాధాకరమని, బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమాతో పాటు ఇతరత్రా సాయం అందజేస్తామన్నారు. ప్రతి కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పారు. మంత్రి వెంట వైకాపా మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, జడ్పీటిసి మాజీ సభ్యుడు ఎం.దేవసహాయం, మదన్‌మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# పుణ్య సంస్మరణ

మాన్యుడు, మరపురాని నేత

## శ్రీ సోమిరెడ్డి రాజగోపాలరెడ్డి గారు

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదీకి 38 సంవత్సరాలు గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరిస్తూ...

వారి పవిత్రాత్మకు భక్త్యంజలి ఘటిస్తున్నాము.

కుమారులు: సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
మాజీ మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు

లేట్ సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

కుమార్తెలు - అల్లుళ్ళు
కట్టంరెడ్డి రాణీసంయుక్త - రాధాకృష్ణారెడ్డి
కేతిరెడ్డి ఉషారాణి - రామకోటారెడ్డి

| మనుమలు | - | మనుమరాండ్రు | మునిమనుమలు | మునిమనుమరాండ్రు |
|---|---|---|---|---|
| సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి | - | శ్రుతి | యల్లా శర్విన్ | యల్లా సంజన |
| డా॥ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి | - | డా॥ లక్ష్మీ ఐషిత | కేతిరెడ్డి శ్రీమన్ | సోమిరెడ్డి శివాని |
| నిమ్మ కౌశిక్‌రెడ్డి | - | డా॥ సింధు | నిమ్మ ధీర్ | కేతిరెడ్డి శ్రితిక |
| సన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి | - | నీలిమ | కేతిరెడ్డి శ్రీవంత్ | కట్టంరెడ్డి శ్రీశాన్వి |
| యల్లా సనత్‌రెడ్డి | - | షాలిని | సన్నారెడ్డి రాయల్ భార్గవ్ | కట్టంరెడ్డి హవిష |
| డా॥ కేతిరెడ్డి కళాధర్‌రెడ్డి | - | డా॥ మాలిని | నిమ్మ నరేన్ | సన్నారెడ్డి నిరుక్తలేఖ |
| కేతిరెడ్డి శశిధర్‌రెడ్డి | - | కీర్తి | సోమిరెడ్డి రణదేవ్ | సోమిరెడ్డి అమైరా |
| కట్టంరెడ్డి విక్రమ్‌రెడ్డి | - | స్నిగ్ధ | | |

# శ్రీసిటీ గ్రామాల్లో అభివృద్ధి భేష్



శ్రీసిటీ పరిధిలోని గ్రామాల ఆర్థిక సామాజిక ప్రగతి బావుందని ఇటీవల శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ బృందం నిర్వహించిన సర్వే నివేదికలు పేర్కొన్నాయి. గతనెల 29న శ్రీసిటీలో సర్వే నివేదిక విడుదల చేశారు. ఎస్వీయు వైస్‌చాన్సలర్ ప్రొ.కె. రాజారెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొ.ఎం.శ్రీనివాసరెడ్డి, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ప్రముఖ సాహితీవేత్తలు ఎం.భూమన్, పాత్రికేయులు ఉమామహేశ్వరరావు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రాజారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ అభివృద్ధి చూసి ఎంతో ఆశ్చర్య పడుతున్నామని అన్నారు. ప్రొ.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శ్రీసిటీ పరిసర గ్రామాల అభివృద్ధిపై చేసిన సర్వే వాస్తవికతకు చాలా దగ్గరగా ఉందన్నారు. శ్రీసిటీ పరిధిలోని 18 గ్రామాల్లో సర్వే చేయగా గ్రామాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరిగాయని, కేవలం ఒక్కశాతం మందికే ఇంకా అవకాశాలు రాలేదని పేర్కొన్నారు. గత పదేళ్ళలో ఇక్కడి ప్రజల ఆదాయం రెండింతలకు మించి ఉందన్నారు. విద్య, వైద్యం, రోడ్ల సౌకర్యాలు మెరుగయ్యాయని, ఇళ్ళ నిర్మాణాలు బాగా పెరిగాయని, క్రైమ్ రేట్ చాలా తగ్గిందని, మహిళలకు వేధింపులు లేవని, గృహహింస తగ్గుముఖం పట్టిందని సర్వేలో పేర్కొన్నారు. విదేశీ పరిశ్రమలతో దేశానికే శ్రీసిటీ తలమానికంగా ఉందని ప్రశంసించారు. 28 దేశాల పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటు కావడం పట్ల శ్రీసిటీ యాజమాన్యం చేసిన కృషి ఎంతో గొప్పదని అందరూ అభినందించారు.

# పచ్చదనం వెల్లివిరుస్తున్న శ్రీసిటీ

## అటవీ అధికారుల ప్రశంస



శ్రీసిటీలో మొక్కల పెంపకం, పచ్చదనం పరిరక్షణ తదితర కార్యక్రమాలు అటవీ అధికారుల అభినందనలు అందుకున్నాయి. ప్రపంచస్థాయి పరిశ్రమలతో పాటు శ్రీసిటీలో పచ్చదనాన్ని కాపాడేందుకు శ్రీసిటీ యాజమాన్యం చేపడుతున్న కార్యక్రమాలను చూసి వారు సంతోషం వ్యక్తం చేశారు. గతనెల 27న రాష్ట్ర చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ సంజయ్ గుప్తా, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఆర్‌పి ఖజురియాతో పాటు తిరుపతి డబ్ల్యుఎల్ఎం సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ ఎస్ శరవణన్ శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్ వారికి స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతిని, శ్రీసిటీని కాలుష్య రహిత ప్రాంతంగా కొనసాగించడానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. శ్రీసిటీలో చెట్ల పెంపకానికి తీసుకుంటున్న చర్యలను శ్రీసిటీ హార్టికల్చర్ డివిజన్ హెడ్ మధుసూదన్‌రెడ్డి వారికి తెలియజేశారు. పచ్చదనం వృద్ధిచెందేలా 'మియావాకి' చెట్ల పెంపకం పద్ధతులను అమలుచేస్తున్నట్లు వివరించారు. శ్రీసిటీ ప్రాంతంలో నిరంతరం అధికసంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఒక మిలియన్ చెట్లను నాటే లక్ష్యానికి చేరువలో ఉన్నామని వారికి వివరించారు. సంజయ్‌గుప్తా మాట్లాడుతూ శ్రీసిటీలో పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాల ప్రగతిని, వేగాన్ని ప్రశంసించారు. ఇండియన్ గ్రీన్‌బిల్డింగ్ కౌన్సిల్ గ్రీన్‌సిటీ గోల్డ్ రేటింగ్‌ను సాధించిన శ్రీసిటీని ఆయన అభినందించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణం వంటి మౌలిక అంశాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాటుచేసిన శ్రీసిటీని ఏపి అటవీశాఖ ఉన్నతాధికారులు సందర్శించడం తాము గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. వారి సూచనలు శ్రీసిటీ ప్రగతికి దోహదపడతాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

## శ్రీసిటీని సందర్శించిన ప్రభుత్వ చీఫ్ విప్

ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సోమవారం సాయంత్రం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి ఇక్కడ పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలు, మౌలిక వసతులు గురించి వివరించారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ శ్రీసిటీ అభివృద్ధి పరిశీలన నిమిత్తం పలువురు ప్రభుత్వ ప్రతినిధులు, ఉన్నతాధికారులు తరచూ శ్రీసిటీ సందర్శనకు రావడం గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రానికి శ్రీసిటీ ఓ వరమని శ్రీకాంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 28 దేశాలకు చెందిన 190 పరిశ్రమలు 50 వేలకు పైగా ఉద్యోగాలు ముఖ్యంగా 50 శాతం మహిళా ఉద్యోగులతో శ్రీసిటీ ప్రగతి సాధించడాన్ని హర్షిస్తూ యాజమాన్యాన్ని అభినందించారు.

# సమర్ధంగా ఎన్నికల నిర్వహణ

## -సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ



తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నికలను సమర్ధంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధం కావాలని సబ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అన్నారు. ఆయన తన ఛాంబర్‌లో సోమవారం రాత్రి మాస్టర్ ట్రైనీలు, తహశీల్దార్లు, ఇతర అధికారులతో ఎన్నికల ప్రక్రియపై సమావేశమయ్యారు. ఎన్నికల నియమావళిని అధికారులు విధిగా పాటించాలని ఆదేశించారు. ఎవరైనా నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కరోనా నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు.

# అప్రమత్తంగా ఉండాలి



గూడూరు పట్టణంలో కరోనా కేసులు వేగంగా పెరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పురపాలక కమిషనర్ ఓబులేసు అన్నారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సెకండ్‌వేవ్ వేగంగా విస్తరిస్తోందని ఒక్క రోజులోనే 25 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

# కరోనాతో జాగ్రత్త!

## డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి



గూడూరు పట్టణంలో కరోనా విలయతాండవం చేస్తున్న పరిస్థితులలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు, ఆటోరిక్షా కార్మికులు, స్థానిక వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎల్లప్పుడూ శానిటేషన్ ఉపయోగించడం, మాస్క్ వాడడం, సోషల్ డిస్టెన్స్ తప్పకుండా పాటించి కరోనా వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సి.ఐ. దశరథరామారావు, ఒకటవ పట్టణ ఎస్సైలు బ్రహ్మనాయుడు, రోజాలత, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బార్ కౌన్సిల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

# వెంగల్‌రెడ్డి, వసంత్‌కుమార్



గూడూరు బార్ కౌన్సిల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాగ వెంగలరెడ్డి, కొత్తపల్లి వసంతకుమార్‌లు ఎన్నికయ్యారు. మంగళవారం గూడూరు కోర్టులో జరిగిన ఎన్నికల్లో న్యాయవాదులు ఓట్లు వేశారు. అనంతరం జరిగిన ఓట్ల లెక్కింపులో అధ్యక్షునిగా నాగ వెంగలరెడ్డి, ప్రధానకార్యదర్శిగా కొత్తపల్లి వసంత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా అంబటి కోటేశ్వరరావు, కార్యదర్శిగా ఎంవి కిష్టయ్య, ట్రెజరర్‌గా నావూరు మస్తానయ్యలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అల్లి విజయ భాస్కర్ తెలిపారు.



ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ గత నెల 30వ తేదీ గూడూరు పురవీధుల్లో నిర్వహించిన ద్విచక్రవాహన ర్యాలీలో పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ ఓబులేసు



# గూడూరు డివిజన్ వార్తలు



## లిటిల్ ఏంజల్స్‌లో

# అటల్ టింకరింగ్ ల్యాబ్

గూడూరు పట్టణంలోని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ పాఠశాలలో భారత ప్రభుత్వ సహ కారంతో ఇటీవల "అటల్ టింకరింగ్ ల్యాబ్"ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయ వచ్చని, విద్యార్థులు అన్ని రకాల ప్రయోగాలు చేసి తమ మేథో సంపత్తిని పాఠశాల స్థాయి నుండే పెంచుకోవచ్చన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూసే స్థాయి నుండి



మరొకరికి ఉద్యోగ అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగడానికి ఈ 'అటల్ టింకరింగ్ ల్యాబ్'లు దోహదపడతాయని, ఈ ల్యాబ్‌లో శిక్షణ ఇచ్చేందుకు నిపుణులైన ఉపాధ్యాయులు ఉంటారని, తమ పాఠశాల విద్యార్థులే కాకుండా ఇతర పాఠశాలల విద్యార్థులు కూడా ఈ ల్యాబ్‌ను వినియోగించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ చంద్రమోహన్, ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ నమఃశివాయ, అకడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుధేష్ణ, టెక్ టీం సొల్యూషన్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో

# వృద్ధులకు అన్నదానం



గూడూరు గమళ్ళపాళెంలోని సాయిరాం ఛారిటబుల్ ట్రస్టునందు సుమారు 40 మంది వృద్ధులకు శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెలా క్రమం తప్పకుండా జరిగే అన్నదానం కార్యక్రమాన్ని శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు, విజయవాడ రైల్వే డివిజన్ డిఆర్‌యుసీసీ మెంబర్ డాక్టర్ బి.శ్యామసుందరరావు (మయూరి శ్యామ్‌యాదవ్) ఆదివారం నిర్వహించడం జరిగింది. ఈ సేవా కార్యక్రమాలు మయూరి స్వీట్స్, బేకరీ మరియు వనజా కృష్ణ కళ్యాణమండపం సహకారంతో జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు కళ్యాణి మరియు మయూరిశ్యామ్ యాదవ్ బావమరిది పునుగు ఆనందరావు పాల్గొని అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

# సీనియర్ పాత్రికేయుడు మల్లికార్జున మృతి



గూడూరు పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు నార్ల మల్లికార్జునరావు అనారోగ్య కారణాలతో నెల్లూరులోని బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందారు. రెండు దశాబ్దాలుగా ఆంధ్రజ్యోతి దినపత్రికలో పాత్రికేయులుగా పనిచేస్తున్నారు. ఆయన మృతిపట్ల పలువురు మిత్రులు, సన్నిహితులు, రాజకీయనేతలు, జర్నలిస్టు సంఘాలు, గూడూరు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా సంతాపం తెలిపారు.

# సమయం ఆసన్నమయింది

గాలి ఇక సమ్మె చేస్తుంది.. పువ్వులూ ప్రతిఘటిస్తాయి
మట్టి సైతం మరణమృదంగం విన్పిస్తుంది
ధరల్ని దావానలంలోకి విసిరే
భయానక రాజకీయ కుతంత్రాన్ని నడిపే
ప్రేలాపనల పర్వాల్లోని ఆంతర్యాల్ని
ఎన్నాళ్ళని సహిస్తుందీ జనం
పాలనను పడకేయించి-
సామంతరాజుల సామ్రాజ్యాలకోసం
రగిలే ప్రభుతకు
ప్రజల ఘోష, భాష ఎలా తలకెక్కుతుంది
ప్రతిపక్షాల దండయాత్ర సాధనే లక్ష్యమైన
అధినాయకత్వానికి-
ఆత్మశోధన ఆంతర్యం ఎక్కడ బోధపడ్తుంది
ప్రజల కడగండ్ల సంక్షోభాన్ని ఉపేక్షించడం దుర్మార్గం
ఎలుకలు తిష్టవేశాయని ఇంటిని తగులబెట్టాలనే అవివేకం
వృత్తినైపుణ్యంతో విజయఫలాలు
సాధించాల్సిన వ్యవస్థల్లో
అమ్మకం మంత్రం జపించే ఉన్మాదం
ప్రైవేటీకరణే సర్వరోగ నివారణమైన
బధిర రధానికి రోదనలెలా విన్పిస్తాయి
కనుపాపే కంటిని కాటేస్తే దేశం బావురుమంటోంది
ఆస్తుల ధర్మకర్తలే స్వాహామంత్రం జపిస్తుంటే
ప్రభుత్వం ఒక నిస్సహాయ
జడపదార్ధమైపోయింది.
నియంతలారా కాలగర్భంలో స్థానం వెదుక్కోండి
ప్రజలంతా అప్రమత్తమై ప్రతిఘటించే
సమయం ఆసన్నమయింది.



- చిన్ని నారాయణరావు
94402 02942

# ఇళ్ళ నిర్మాణాల్లో అపోహలు వద్దు

- 95 లేఅవుట్లలో మోడల్ ఇళ్ళను నిర్మిస్తాం
- హౌసింగ్ పీడీ ఆదిసుబ్రహ్మణ్యం వెల్లడి

ప్రభుత్వం చేపడుతున్న ఇళ్ళ నిర్మాణాలపై ఎవరికీ అపోహలు ఉండాల్సిన అవసరం లేదని, ఇంటికి 1.80 లక్షలు సరిపోదన్న వాదనలు వినిపిస్తున్నాయని, ఇలాంటి అపోహలు తొలగించేందుకు ప్రతి లేఅవుట్‌లో ప్రభుత్వం ఇంటి నిర్మాణం చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామని గృహనిర్మాణసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె. ఆదిసుబ్రహ్మణ్యం చెప్పారు. ఇటీవల ఆయన మనుబోలులోని సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతూ జిల్లాలోని 95 లేఅవుట్‌లలో తొలుత ప్రభుత్వం మోడల్ గృహాలను నిర్మించనుందని తెలిపారు. జిల్లాలో ఇప్పటికి 53,953 మందికి ప్రభుత్వం ఇళ్ళు మంజూరు చేసిందని, ఇందులో 11,078 మంది సొంతస్థలాలు కలవారు ఉన్నారని పేర్కొన్నారు. ప్రతి లబ్దిదారునికి ప్రభుత్వం నాలుగు ట్రక్కుల ఇసుక ఉచితంగా ఇస్తుందని, ఇదికాక సిమెంట్, స్టీల్ తక్కువ ధరలకే ఇప్పించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే లేఅవుట్‌లలో నీటివసతి కల్పించేందుకు 42 కోట్ల రూపాయలు మంజూరు చేసి ఉందన్నారు. ఇళ్ళ నిర్మాణంపై సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషయ్య, ఏఇ మనోజ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

# జీఓ నెంబరు 2ను రద్దు చేయండి

## — పంచాయతి కార్యదర్శుల ఆందోళన —

గ్రామ సచివాలయ వ్యవస్థలో విఆర్‌ఓలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీఓ నెంబరు 2ను రద్దుచేయాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా అనేకచోట్ల పంచాయతి కార్యదర్శులు ఇటీవల పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. అనుమసముద్రంపేట మండలంలోని అన్ని గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది మండలకేంద్రంలోని ఎండిఓ కార్యాలయం వద్దకు వచ్చి ధర్నా నిర్వహించారు. జిఓ నెంబరు–2 వల్ల సచివాలయ ఉద్యోగులు, వారి జీతభత్యాలు, పథకాల నిర్వహణ, గ్రామ వలంటీర్ల పర్యవేక్షణ అంతా విఆర్‌ఓలకు కల్పించి ఉన్నారని, ఇది అన్యాయమని వారు పేర్కొన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి నేటిదాకా ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తూ దేశంలోనే గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలు అగ్రగామిలో నిలిచేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శులు చేసిన కృషి ఎంతో ఉందని, దానిని విస్మరించి ఇప్పుడు పంచాయతి కార్యదర్శులకు ప్రాధాన్యత తగ్గిపోయేలా జీఓ ఇవ్వడం దారుణమన్నారు. దీంతో సర్పంచ్ అధికారాలకు కూడా కోత పడుతుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ విషయాలన్నిటినీ మరోసారి కూలంకుషంగా పరిశీలించి ఆ జిఓను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# విద్యుత్ బకాయిలు చెల్లించండి

## —— పంచాయతీలకు ఎస్ఇ ఆదిశేషయ్య విజ్ఞప్తి

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో విద్యుత్‌శాఖకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని విద్యుత్‌శాఖ ఎస్ఇ ఆదిశేషయ్య విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మొత్తం 36 మేజర్, 904 మైనర్ పంచాయతీలు ఉన్నాయని, ఈ పంచాయతీలకు సంబంధించి 11295 విద్యుత్ సర్వీసులున్నాయని, పంచాయతీలు వీటికి సంబంధించి చెల్లించాల్సిన బకాయిలు ఇంకా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. జిల్లా పంచాయతి అధికారి సూచనల మేరకు 14వ ఆర్థికసంఘం నిధుల్లో విద్యుత్‌శాఖకు చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీలన్నీ కలసి విద్యుత్‌శాఖకు 34.70 కోట్ల రూపాయల దాకా బకాయిలు ఉండగా ఇప్పటిదాకా 18.48 కోట్లు చెల్లించారని, మిగిలిన 16.32 కోట్లు కూడా చెల్లించి విద్యుత్ సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

# ఆటో ఢీ.. ఇద్దరు మహిళల మృతి

పొదలకూరులోని పొట్టేళ్ళ వాగు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో ఢీకొని పొదలకూరు శ్రామికనగర్‌కు చెందిన యాకసిరి రమణమ్మ(70), ఈగా పోలమ్మ(60) దుర్మరణం పాలయ్యారు. అంగడికి వెళ్ళి సరుకులు తీసుకుని ఇళ్ళకు తిరిగివస్తుండగా దారిలో ఈ దారుణం జరిగింది. మనుబోలుకు వెళ్తున్న ఓ ఆటో వేగంగా వచ్చి ఢీకొనడంతో రమణమ్మ అక్కడికక్కడే మృతిచెందగా, పోలమ్మ సమీపంలోని పిహెచ్‌సిలో చికిత్సపొందుతూ మరణించింది. వీరి మృతితో పొదలకూరులో విషాదం అలుముకుంది. ఎస్ఐ కోట రఘేంద్రెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# కమనీయం..శ్రీ లక్ష్మీనారసింహుని కల్యాణం

ఇందుకూరుపేటలో వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనారసింహుని కల్యాణోత్సవం గతనెల 27న కనువిందుగా జరిగింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారికి గజవాహనోత్సవం, పూలంగిసేవ నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ అర్చకులు ఉదయగిరి వెంకటశేషాచార్యులు, రంగచార్యులు, వేదగిరి సత్యనారాయణాచార్యులు, నందకిషోర్, నరేష్, కమలాకర్‌లు పూజా కార్యక్రమాలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించి భక్తులకు స్వామివార్ల అక్షింతలు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ఛైర్మెన్ వేళ్ళ భానుచంద్రశేఖర్, ఆలయ ఇ.ఓలతో పాటు పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

## కన్నుల పండువగా..

# శివపార్వతులకు పుష్పయాగం

ఎంతో ప్రసిద్ధిచెందిన కావలి శివాలయంలో కొలువైవున్న దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గతనెల 28న స్వామివార్లకు కన్నుల పండువగా పుష్పయాగం నిర్వహించారు. శివాలయం వంశపారంపర్య అర్చకులు ఎఆర్ శశిధర్ గురుకుల్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ వేడుక జరిగింది. అనంతరం స్వామివార్లకు ఊంజల్‌సేవ, పల్లకి సేవలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కసవరాజు మురళీధర్ పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# శరణన్న వారిని కరుణించే చల్లనితల్లి.. 'కలువాయమ్మ'

**భక్తుల పాలిట కల్పవల్లి..ఆపదలు బాపే అమ్మ..శరణన్న వారిని కరుణించే చల్లనితల్లి..కలువాయమ్మ తల్లి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని మండల కేంద్రమైన కలువాయి ప్రజల ఆరాధ్యదైవం..కలువాయి గ్రామ దేవత కలువాయమ్మ. ఎంతో పురాతన కాలంనుంచి అమ్మవారు ఇక్కడి భక్తుల పూజలందుకుంటోంది. కలువాయి బస్టాండ్‌కు సమీపంలోనే అమ్మవారికి ఇక్కడ అద్భుతమైన ఆలయం ఉంది. మహిమాన్విత శక్తిస్వరూపిణి అయిన అమ్మవారు ఏడడుగుల విగ్రహమూర్తిగా.. భక్తాభీష్టప్రదాయినిగా ఇక్కడ కొలువై ఉండడం విశేషం. అమ్మవారి ఆలయానికి సుమారు ఏడువందల సంవత్సరాలనాటి స్థలపురాణం కూడా ఉంది. ఆలయ ఆవిర్భావం వెనుక ఆసక్తికరమైన కథనాలు కూడా ప్రచారంలో ఉన్నాయి.**

కలువపూలు ఎక్కువగా ఉన్న ప్రాంతం కనుక ఈ గ్రామానికి కలువాయి అనే పేరు వచ్చి ఉంటుందని, ఇక్కడ కలేచెట్లు కూడా విస్తారంగా ఉండేవని పెద్దలు చెప్తుంటారు. అడవిలాగా ఉన్న ఈ ప్రాంతాన్ని చదునుచేసి పురాతన కాలంలో ఇక్కడ అమ్మవారికి ఆలయం నిర్మించారని అంటుంటారు. కలువాయమ్మ గ్రామదేవతగా వెలసిన ఊరు కనుక 'కలువాయి' అనే పేరు స్థిరపడిందని కూడా పెద్దల మాట.

## అమ్మవారి ఆలయ చరిత్ర :

దాదాపు ఏడువందల సంవత్సరాల క్రితం నాటి సంగతి ఇది. శక్తిస్వరూపిణి అయిన అమ్మవారు ఆ కాలంలో మానవ రూపంలోనే సంచరిస్తూ ప్రజల బాగోగులు చూస్తూ, కాలక్రమంలో తన ఏడుగురు చెల్లెళ్ళు, ఒక సోదరునితో సహా ఈ ప్రాంతానికి వచ్చి ప్రజలను కాపాడే చల్లనితల్లిగా.. గ్రామదేవతగా స్థిరపడినట్లు స్థలపురాణం. అప్పట్లో కలువాయమ్మతో పాటు తన ఏడుగురు చెల్లెళ్ళయిన పోలేరమ్మ, సత్తెమ్మ,







## మన దేవాలయాలు (41)

ఊరంకమ్మ, ఇనుకుంట అంకమ్మ, బంగారమ్మ, మాతమ్మలతో పాటు తమ్ముడైన పోతురాజుతో కలసి ఎడ్లబండిపై వస్తుండగా కలువాయి ప్రాంతానికి రాగానే బండి ఇరుసు విరిగిపోవడంతో అమ్మవారు దేవతగా ఇక్కడే స్థిరపడినట్లు చెప్తుంటారు. ఆ కాలంలో ఈ ప్రాంతంలో ఉన్న కమ్మంపాడు, బోడిపాడు, కండ్రిక, ఏకూరుపల్లి, కొత్తపాడు, ఫకీరుపల్లి, గెంజేడిపాడు ప్రాంతాలన్నీ కలసి ఈ ఏడు గ్రామాలూ ఒకే గ్రామంగా ఏర్పడ్డాయని, అమ్మవారు గ్రామదేవతగా ఇక్కడ స్థిరపడడంతో ఈ ఊరికి కలువాయి అనే పేరు వచ్చిందని కూడా అంటారు. అప్పట్లో పడమటి ప్రాంతాల నుంచి వచ్చిన కలువాయమ్మ తల్లి..తమతోపాటు వచ్చిన పునగాని వంశీకులకు కూడా ఇక్కడ కుడివైపు స్థలం చూపించి ఇక్కడే ఉండమని ఆదేశించడంతో అమ్మవారి ఆజ్ఞ మేరకు వారు కూడా పురాతనం కాలం నుంచి ఇక్కడే స్థిరపడ్డారని పెద్దలు చెప్తుంటారు. నాటి నుంచి నేటికీ ఆ కులస్తులే అమ్మవారి ఆలయానికి అర్చకులుగా ఉన్నారు కూడా. గ్రామానికి చెందిన రెడ్డిగార్లు కూడా అమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి పూజలు చేయడం ప్రారంభించారని, నేటికీ అమ్మవారికి ప్రథమపూజ ఆ కులస్తులే చేస్తుంటారని చెప్తున్నారు. కలేచెట్లు విస్తారంగా ఉన్న ఈ ప్రాంతాన్నంతా వారే చదునుచేసి అప్పట్లో అమ్మవారికి పూజలు ప్రారంభించారని కూడా అంటున్నారు. కలువాయమ్మ అమ్మవారితో పాటు వచ్చిన చెల్లెళ్లు, సోదరుడు కూడా చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో గ్రామదేవతలుగా ఆవిర్భవించి నేటికీ అందరి పూజలందుకుంటున్నారు.

## ఎంతో మహిమగల దేవత కలువాయమ్మ తల్లి

కలువాయమ్మ తల్లి ఎంతో మహిమగల దేవత అని, భక్తితో కొలుచుకున్నవారి కష్టాలు తీరిపోయి, వారి జీవితాల్లో శుభాలు కలుగుతాయని భక్తులు చెప్తున్నారు. ముఖ్యంగా కలువాయి ప్రజలకు, చుట్టుపక్కల ఉన్న అనేక గ్రామాల ప్రజలకు అమ్మవారే ఆరాధ్యదైవం. ఏ వస్తువు కొనాలన్నా, ఏ శుభకార్యం జరపాలన్నా ముందుగా అమ్మవారికి మొక్కుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తుంటారు. కొత్తగా పెళ్ళి చేసుకునేవారు కూడా అమ్మవారికి పూజలు చేసుకుని మొక్కుకుంటే ఆ పెళ్ళి నిరాటంకంగా జరుగుతుందని, వారి జీవితాలు సుఖసంతోషాలతో ఉంటాయని ప్రతీతి. కారుణ్యమూర్తి అయిన కలువాయమ్మ అమ్మవారి కరుణతో భక్తుల ఆపదలు తొలగిపోతాయని, భక్తుల బాధలు తీర్చే చల్లని తల్లి..కలువాయమ్మ తల్లి అని ప్రతీతి. ఇటీవలి కాలంలో అనేక మంది దాతలు, అమ్మవారి భక్తులు ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారు. చక్కని ముఖద్వారంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో అమ్మవారి గుడి భక్తులందరినీ బాగా ఆకట్టుకుంటోంది. అమ్మవారికి ప్రతినిత్యం పూజలు, సేవలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతూనే ఉంటాయి. ప్రతి ఏటా అంగరంగ వైభవంగా జాతర జరుగుతుంటుంది. సుడిమాను ఉత్సవం జాతరలో ప్రత్యేకం. కలువాయమ్మ అమ్మవారి జాతరకు భక్తజనం లక్షలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటుంటారు.

# కొండ బిట్రగుంటలో మంత్రి గౌతంరెడ్డి

## • ప్రసన్న వేంకటేశ్వరునికి పూజలు



రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామిని గతనెల 29న దర్శించు కున్నారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో మంత్రిని స్వాగతించారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలసి స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ మంత్రికి వివరించారు. కొండ దిగువన చేపట్టనున్న నిర్మాణపు పనులను, భక్తుల వసతి కోసం చేయాలనుకున్న అభివృద్ధి పనులను మంత్రికి తెలియజేశారు. తొలుత శ్రీ స్వామివారి చిత్రపటాన్ని ఆయన మంత్రికి బహుకరించారు.

# చిన్నారి స్నేహమా..



'చిన్నారి స్నేహమా చిరునామా అందుకో'... అంటూ నెల్లూరు జిల్లా గూడూరు మండలంలోని చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత నెల 28న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1979-80వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన వారు ఈ సమ్మేళనంలో పాల్గొని తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థి, ఒంగోలు ఆర్టీఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లా డుతూ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారమందిస్తామన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు శ్రీనివాసులును సత్కరించారు.

# కరోనా కోటీశ్వరులు

(మొదటి పేజీ తరువాయి)

రావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. అయితే ఇప్పుడు మళ్ళీ కరోనా-2 వ్యాప్తి వేగంగా ఉన్నప్పటికీ, ప్రజలు పెద్దగా భయపడడం లేదు. వ్యాధి పట్ల అవగాహన ఏర్పడి, చికిత్స విధానం తెలిసిపోయింది కాబట్టి ఎవరూ ఆందోళన చెందడం లేదు.

అయితే కరోనా మహమ్మారిని, పెనుభూతంలా చిత్రీకరించి, వ్యాధి సోకిన వాళ్ళని భయపెట్టి డబ్బులు గుంజిన కొంతమంది వైద్య ప్రబుద్ధులు, స్కానింగులు, టెస్టుల పేరుతో దోపిడీకి తెరలేపిన కొన్ని సంస్థలు మాత్రం తమ బుద్ధి పోనిచ్చుకోవడంలేదు. ప్రజల బలహీనతను తమ ఆర్థిక బలంగా మార్చుకుంటున్న ఈ నీచులు అవగాహన లేని సామాన్యులను భయపెడుతూనే ఉన్నారు. రెండవ దశ ఇంకా తీవ్రంగా ఉంటుం దని, జాగ్రత్తగా ఉండకపోతే ప్రాణాలకే ప్రమాదమని వణికిస్తున్నారు. ప్రజలేమైపోయినా పరవాలేదు, తాముమాత్రం గల్లా పెట్టె నింపుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే కరోనా కాలంలో నష్టపోయిన మొత్తాన్ని పూరించుకోవడానికి చాలామంది వైద్యులు తమ ఫీజులను, ఆసుపత్రి చార్జీలను అమాంతం పెంచేశారు. కొంతమంది ప్రభుత్వ వైద్యులు సైతం ఈ మాయదారి రోగాన్ని అడ్డం పెట్టుకుని అడ్డంగా దోచేశారని సమాచారం. లాక్‌డౌన్ పుణ్యమా అని కొన్ని చోట్ల మందుల షాపుల యజమానులే డాక్టర్ల అవతారమెత్తి తమ ఇష్టానుసారం మందులను ఇచ్చి డబ్బులు గుంజుకున్నారని కొంతమంది వాపోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్న ఇలాంటి వాళ్ళ ఆలోచనలని ప్రజలే తిప్పికొట్టాలి. టీకా వేసుకుని, మాస్కులు తొడుక్కొని, శానిటైజర్లు వాడుకుంటూ, భౌతికదూరం పాటిస్తే ఆందోళనపడాల్సిన అవసరమే లేదు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది, మనల్ని మనమే రక్షించుకోవాలి. ఇలాంటి నీచమైన ఆలోచన చేస్తున్న వ్యక్తులకు, సంస్థలకు బుద్ధి చెప్పాలి. లాక్‌డౌన్ అవసరం లేకుండానే కరోనా మహమ్మారిని నియంత్రించి తరిమేయగలమన్న ధీమాని భరోసాని కల్పించే బాధ్యత ప్రభుత్వాలు తీసుకుంటే మళ్ళీ లాక్‌డౌన్ రావాలని కోరుకుంటున్న 'రక్త పిశాచాలకు' అడ్డుకట్ట వేసినట్లే.

కరోనా చాలామంది జీవితాల్లో పెను మార్పు తెచ్చింది. బంధాలు, బాంధవ్యాల విలువ తెలిపింది. కోట్లాదిమంది ఆలోచనలలో మార్పు తెచ్చింది. లక్షలాది కుటుంబాల జీవనశైలిని మార్చింది. ఆరోగ్యం పట్ల అవగాహన పెంచింది. పరిశుభ్రత ప్రయోజనాన్ని తెలియజేసింది. ఇలాంటి కొంతమంది రక్తపింజర్లలో మాత్రం పరివర్తన తీసుకు రాలేదు, సంపాదన పట్ల వారికున్న యావను చంపలేదు. 'కాంచానాం కర్మ విమోచనం' అని చెప్పిన పెద్దలే 'వైద్యో నారాయణో హరిః' అనికూడా చెప్పారు, వీళ్ళు మాత్రం రెండవది మర్చిపోయి మొదటిది మాత్రమే గుర్తుపెట్టుకున్నారు. మొత్తం వైద్య వ్యవస్థ అలా వుందని మేమనడంలేదు, అలా ఉన్న వారిని మారమనే చెప్తున్నాం. గుమ్మడికాయల దొంగలు ఎవరో వాళ్ళే భుజాలు తడుముకోండి!

# గోచీ లేదు... మొలతాడూ లేదు! అయినా...!!

దేశమంతా బలోపేతం అవుతున్నాం... ఆంధ్రాలో ఎందుకు అవ్వలేకపోతున్నాం అనుకుంటూ బీజేపీ ఒకానొక సుము హూర్తంలో అంతర్మధనానికి లోనయ్యింది. బలపడడానికి మార్గాలు ఏమిటా అని అదేపనిగా ఆలోచించింది. మతపరమైన భావోద్వేగాలు రెచ్చగొట్టి, హిందువులను ఓ రేవుకు చేర్చుదా మంటే.. ఆంధ్ర ముస్లింలు కూడా ఆంధ్ర వారే అయ్యారు. హిందువులకు- ముస్లింలకు మధ్యలో పుల్లలు పెట్టడం అయ్యే పనిలా కనిపించలేదు. పోనీ ఆంధ్రను వదిలేద్దామా అంటే- పరువు తక్కువ. వెంకయ్యనాయుడును పక్కకు తప్పించిన తరవాత, ఆంధ్రాలో బీజేపీకి దిక్కూ, మొక్కూ లేకుండాపోయింది అనుకుంటారు. ఏం చేయాలి... ఏం చేయాలి అనుకుంటుం డగా.. కాపులు గుర్తుకు వచ్చారు. పెద్ద సంఖ్యలో జనాభా. సరైన లీడర్లు లేరు. వాళ్ళ మీద వల విసురుదాము అనుకున్నారు. మన పార్టీలో ఎవరున్నారూ అని ఆలోచిస్తే....సోము వీర్రాజు కనపడ్డారు. అంతకు ముందు, కన్నా లక్ష్మీనారాయణ కనిపించారు గానీ, అది బయటినుంచి వచ్చిన సరుకు. మనసులు కలవలేదు. బీజేపీలో ఎవరెవరిని ప్రసన్నం చేసుకోవాలో కూడా, కన్నాకు 'పట్టు' దొరకలేదు.

సోము వీర్రాజు అయితే, ఓన్ మాన్యుఫాక్చరింగ్ ప్రోడక్ట్. పైపెచ్చు, బీజేపీలో కిటుకులు, పట్లు బాగా తెలిసినవాడు. దానితో, కాలికి గజ్జ కట్టి, మొహానికి బొట్టు పెట్టి- రంగంలోకి వదిలారు. కన్నా లక్ష్మీనారాయణకు తెలియని మెళకువలు సోము వీర్రాజుకు చాలా తెలుసు. ఏ సందర్భంలో ఏం మాట్లాడాలో... ఏం మాట్లాడకూడదో తెలుసు. అన్నింటికీ ఓ లెక్క ఉంటుంది.



పవన్ కళ్యాణ్‌ను, చిరంజీవిని కలిసి, వారి శుభాకాంక్షలు అందుకున్నారు. (ఈ పని 'కన్నా' చేసినట్టు గుర్తు లేదు)

2024లో ఆంధ్రలో అధికారం చేజిక్కించు కోవడం ఖాయం అనే ఊపులో హ్యాపీగా రాజకీయం చేసుకుంటూ పోతుండగా తిరుపతి ఎం.పీ బల్లి దుర్గాప్రసాద్ కరోనా బారినపడ్డారు.




2024 వరకు, మధ్యలో ఏ ఉప ఎన్నికలూ రాకుండా ఉండి ఉన్నట్లయితే, సోము వీర్రాజుకు తిరుగుండేది కాదు. కానీ, తిరుపతి ఎం.పీ సీటుకు దిక్కుమాలిన బై-ఎలక్షన్ వచ్చి పడింది.

తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో బలిజలు గణనీయంగా ఉన్నారు. నెల్లూరు నుంచి మొదలుపెట్టి, రాయల సీమ అంతటా బలిజలు అంటారు. అదే, ప్రకాశం జిల్లాలో తెలగలు అంటారు. కోస్తాలో కాపులు అంటారు.

సరే. తిరుపతిలో కాపులు ఎక్కువ కాబట్టి, సోము వీర్రాజు ఎగిరి గంతేయాలి. తన కులపోళ్ళు అధికంగా ఉన్న నియోజక వర్గంలో ఉప ఎన్నిక వచ్చినందుకు... తన పవర్ చూపించాలి. తన కులానికి తోడు, హిందువులంతా బీజేపీ వెనకాలే ఉంటారు అనే భావన బీజేపీకి ఉండడం సహజం కనుక తిరుపతి ఉప ఎన్నికను సోము వీర్రాజు ఒక సువర్ణావకాశంగా తీసుకోవడం ఖాయం అని వీర్రాజు అభిమాన లోకం ఆశించింది.

ఎందుకో గానీ, ఆయన మాత్రం అలా అనుకోలేదు. గాలి పోయిన బెలూన్ లాగా చప్పున చల్లారిపోయారు.

తాను వెనక్కి తగ్గేసి, తన కులానికే చెందిన పవన్‌కళ్యాణ్‌కు కితకితలు పెట్టారు. పవన్ కళ్యాణ్ అంటే తనకు ఎంతో ఇష్టమని, ఆయనను పువ్వుల్లో పెట్టి చూసుకోవాలని, ఆయనను ముఖ్యమంత్రిని చేయాలని మోడీ గారు చెప్పారని వీర్రాజు గారు చెప్పారు. మోడీ గారు గానీ, సోము వీర్రాజు గానీ అబద్ధాలు చెప్పే నేతలు కాదు కదా! అందువల్ల, సోము వీర్రాజు మాటలను నమ్మకపోవడానికి కారణం కనపడడం లేదు.

అయితే మోడీ గారు సోము వీర్రాజుకు ఎప్పుడు...ఎక్కడ... ఎలా... ఎందుకు... ఏ సందర్భంలో చెప్పారన్నది మాత్రం సోము గారు చెప్పలేదు. ఒకవేళ మొబైల్‌లో చెబితే... చెప్పి ఉండవచ్చు. ఇద్దరికీ మొబైల్ ఫోన్‌లు ఉండడం సహజం కనుక.

దీనిని బట్టి, 2024లో ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్నీ సోము వీర్రాజు, జీవీఎల్ నరసింహారావు, విష్ణువర్ధన్‌రెడ్డి, మొదలైనవారు వదిలేసుకోవడం చూస్తుంటే చాలా బాధేస్తున్నది.

ఇక్కడ కొన్ని లా పాయింట్లు అదేపనిగా పీడిస్తున్నాయి.

1. తాను స్వయంగా కాపు అయి ఉండి కూడా, తిరుపతి ఏరియాలోని కాపులను రంజింపలేకపోతానేమో అన్న శంకకు సోము వీర్రాజు లోనవడం ఏమిటి?

2. జనసేన లేకుండా పోటీ చేయలేమన్న భావనకు - దేశాన్ని ఊపేస్తున్న బీజేపీ రావడం ఏంటి?

3. బీజేపీలోనే బోలెడు మంది కాకలు తీరిన నాయకులు ఉండగా- రాజకీయాలు పీకి చేతిలో పెడితే....మొదలేదో- చివరేదో ఇప్పటికీ తెలియని పవన్ కళ్యాణ్‌ను సీఎం చేయాలని మోడీ గారు సోము వీర్రాజుకు చెప్పడం ఏంటి?

5. ఏం? పవన్‌తో మోడీ గారు టాకింగ్‌టర్మ్స్‌లో లేరా?

6. ఇద్దరూ కలుసుకుని, ఆత్మీయంగా మాట్లాడుకుని ఎంత కాలం అయింది?

7. 2014 ఎన్నికలప్పుడు మోడీ గారు పవన్‌ను 7 సార్లు తన హెలికాప్టర్ ఎక్కించుకుని, సభలలో తన పక్కనే కూర్చో బెట్టుకున్నారని వీర్రాజు చెప్పారు. సంతోషం వేసింది. మరి, 2019 ఎన్నికల్లో మోడీ గారు- పవన్ కళ్యాణ్‌ను తన హెలికాప్టర్‌లో ఎన్నిసార్లు ఎక్కించుకున్నారో వీర్రాజు చెప్పలేదు. అందువల్ల, ఆ అంకె కూడా చెబితే, మరోసారి సంతోషించడానికి అవకాశం ఉండేది.

4. పవన్ కళ్యాణ్ తిరుపతి ప్రచారానికి వస్తారో... రారో అంటూ బీజేపీ నేతలు నానా హైరానా పడిపోవడం ఏంటి?

5. అసలు మోడీ-షా మ్యాజిక్ తిరుపతిలో పనిచేయదని బీజేపీ నేతలు భావిస్తున్నారా?

చివరిగా..

ఏడు కొండలవాడా... వేంకట రమణా... గోవిందా... గోవింద! తిరుపతి బై-ఎలక్షన్‌లో జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్న విషయం నీకు తెలిసిందే.

దేవదేవా... బీజేపీని నోటా కంటే కూడా తక్కువ ఓట్లు వస్తున్నాయనే అపప్రద నుంచి బయటపడేసి, తిరుపతి బై-ఎలక్షన్‌లో డిపాజిట్ వచ్చేటట్టు అనుగ్రహించి, నోటా కంటే ఒక్క ఓటు అయినా ఎక్కువ వచ్చేటట్టు అనుగ్రహించు తండ్రీ! నేను నీ కొండకు వచ్చి, తలనీలాలు సమర్పించుకుంటాను స్వామీ!

ఎందుకంటే- నీ పార్లమెంటరీ నియోజకవర్గంలో మొత్తం పదిహేను లక్షల డెబ్బయి అయిదువేల మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు- ఏడు లక్షల డెబ్బయి ఎనిమిది వేల మంది. స్త్రీలు- ఓ ఇరవై వేలు ఎక్కువ. అంటే- ఏడు లక్షల తొంభై ఎనిమిది వేలు.

కిందటిసారి గెలిచిన బల్లి దుర్గాప్రసాద్‌కు ఏడు లక్షల ఇరవైమూడు వేల ఓట్లు వచ్చాయి. రెండో ప్లేస్ నోటాది. నోటాకు ఇరవై ఐదువేల, ఏడు వందల, ఎనభై ఒక్క ఓట్లు వచ్చాయి. మూడో ప్లేస్‌లో కాంగ్రెస్, నాలుగో ప్లేస్‌లో బీఎస్పీ వచ్చాయి. బీజేపీకి అయిదో స్థానం- నోటా కంటే తక్కువగా పదహారు వేల, నూట పాతిక ఓట్లు వచ్చాయి. అందుకే, ఈసారి నోటా కంటే ఒక్క ఓటు అయినా ఎక్కువ వచ్చేటట్టు అనుగ్రహించి, 2024లో బీజేపీ-జనసేన రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే మార్గం సుగమం చేయి తండ్రీ!

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# తలైవాకు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

సంపాదించుకున్న రజనీకాంత్‌కు 51వ 'దాదా సాహెబ్ ఫాల్కే' అవార్డును అందజేయనున్నామని, 2019 సంవత్సరానికి గాను ఆయన ఈ అవార్డును అందుకోనున్నట్లు కేంద్ర సమాచార మరియు ప్రసార శాఖామాత్యులు ప్రకాష్ జవదేకర్ ఈ నెల 1వతేదీ గురువారం ప్రకటించారు. ఈ అవార్డును 2020లోనే ప్రకటించ వలసి ఉందని, కరోనా కారణంగా అప్పట్లో ప్రకటించలేకపోయా మని జవదేకర్ తెలిపాడు. ట్విట్టర్ వేదికగా ఆయన ఈ ప్రకటన చేశాడు. ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రజనీకాంత్‌కు అభినందనలు తెలియజేశారు. రజనీకాంత్ మీడియాతో మాట్లాడుతూ తనకు వచ్చిన ఈ అవార్డును తన అభిమానులకే అంకితమిస్తున్నానని అంటూ నరేంద్ర మోడీ మరియు జవదేకర్‌లకు తన కృతజ్ఞతలు తెలియజేశారు.

# కోవిడ్ సెకండ్ వేవ్‌తో జాగ్రత్త



కోవిడ్-19 సెకండ్ వేవ్ వ్యాప్తి పట్ల జాగ్రత్త వహించాలని అపోలో హాస్పిటల్ డాక్టర్ ఏకే చక్రవర్తి అన్నారు. గత నెల 29న నెల్లూరు ఏసీ స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోవిడ్-19 సెకండ్ వేవ్ వ్యాప్తి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి పలగాటి శ్రీనివాసులురెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ యువత తప్పనిసరిగా కోవిడ్ వాక్సిన్ వేసుకోవాలని, మాస్కులు ధరించి సామాజిక దూరం పాటించాలన్నారు. ముఖ్యఅతిథులుగా వాకర్స్ జిల్లా 203 గవర్నర్ ఏకొల్లు రాఘవరెడ్డి, క్యాబినెట్ సెక్రటరీ నలుబోలు బలరామయ్యనాయుడు, డిప్యూటీ గవర్నర్ వేలూరు రంగారావు, వాకర్స్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, కోశాధికారి మాగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ చక్రవర్తిని వాకర్స్ సభ్యులు సత్కరించారు.

### ఏప్రిల్ 6 నుంచి

# పినాకిని గాంధీ ఆశ్రమం శతజయంతి ఉత్సవాలు

**- రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి**

జాతిపిత మహాత్మా గాంధీజీ స్వహస్తాలతో ప్రారంభించిన ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం ఏర్పాటై వంద వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆశ్రమ శత జయంతి ఉత్సవాలను ఏప్రిల్ 6 నుంచి 8వ తేది వరకు ఘనంగా నిర్వహిస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

గతనెల 29న ఆయన పినాకిని గాంధీ ఆశ్రమంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామానికి వేదికగా నిలిచిన ఈ ఆశ్రమంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కరోనా నేపథ్యంలో ఉన్నతాధికారుల సూచనలతో తగు జాగ్రత్తలతో వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 6వ తేది నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి పల్లిపాడు ఆశ్రమం దాకా శాంతి ర్యాలీ నిర్వహిస్తామని, 7వ తేదిన ఆశ్రమంలో ప్రముఖుల సందేశాలు ఉంటాయని చెప్పారు. 8వ తేదిన ముగింపు వేడుకల్లో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని, ఎంతో స్ఫూర్తిదాయకమైన ఈ ఆశ్రమం శతజయంతి ఉత్సవాలను అందరూ జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆశ్రమం కన్వీనర్ గణేశం కల్పనమ్మ, కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి, ఆశ్రమ కమిటీ అడ్వయిజర్ గునపాటి ప్రసాద్‌రెడ్డి, కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, జీవి రామిరెడ్డి, గంపల మంజుల, వెంకటేశ్వరప్రసాద్‌తో పాటు సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### 13 మండలాల స్థాయిలో

# బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

**వెంకటరెడ్డిపల్లిలో ఏర్పాట్లు**



జిల్లాలోని కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లిలో ఏప్రిల్ 10,11 తేదీల్లో 13 మండలాల స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు రంగం సిద్ధం చేస్తున్నారు. కలువాయి, రాపూరు, డక్కిలి, బాలాయపల్లి, సైదాపురం, గూడూరు, పొదలకూరు, చేజర్ల, ఆత్మకూరు, అనంతసాగరం, సంగం, మర్రిపాడు, వింజమూరు మండలాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన వచ్చని నిర్వాహకులు తెలిపారు. నేతాజీ యువజన క్రీడామండలి ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీలకు మాదాసు యజ్ఞ పవన్, శ్రీరాగ్, శివాని సహకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు 9490321545, 9542188340 నెంబర్లకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

### ప్రతి పంచాయతీలోనూ..

# విరివిగా మొక్కలు నాటాలి

**- డ్వామా పీడీ తిరుపతయ్య**

జిల్లావ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని డ్వామా పీడీ తిరుపతయ్య సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గతనెల 29న ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన అధికారుల సమావేశంలో మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు, నీటికుంటలు ఏర్పాటుచేయడం, చెక్‌డ్యాంలు నిర్మించడం తదితర అంశాలపై చర్చించారు. ఒక్కో పంచాయతీలో కనీసం నాలుగు వేల మొక్కలు నాటేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని, జిల్లాలో 20 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలన్నారు. నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను సేకరించాలని, ఇంకా కావాల్సిన మొక్కల సేకరణకు ప్రయత్నిస్తామని చెప్పారు. వర్షపునీరు వృధాగా పోకుండా చర్యలు తీసుకోవాలని, నీటికుంటలు చెక్ డ్యామ్‌లలో నీళ్ళు నిల్వ ఉంటే భూగర్భ జలాల మట్టం కూడా బాగా పెరుగుతుందని సూచించారు.

### ఇరుకళల పరమేశ్వరిదేవి అమ్మవారికి..

# 6.73 లక్షల ఆదాయం

సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఏర్పాటుచేసిన హుండీల ద్వారా భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు 6,73,242 రూపాయలు వచ్చాయని ఆలయ ఇ.ఓ పెంచలవరప్రసాద్ పేర్కొన్నారు. గతనెల 29న అమ్మవారి ఆలయ హుండీలను లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ నెల్లూరు డివిజన్ ఇన్స్‌పెక్టర్ చైతన్య పర్యవేక్షణలో హుండీ లెక్కింపు జరిగింది. ఆలయ ఛైర్మెన్ సురేంద్ర, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఈక్షణం -మంజీర

# తిరుపతి తీర్పు?

తిరుపతి లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక ప్రక్రియ మొదలైంది. గెలుపు వైసీపీదేనని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఓటర్ల దృష్టి మాత్రం... కొద్దిరోజుల క్రితం వరకు వైసీపీ ఎవరిని అభ్యర్థిగా నిలుపుతోంది, టీడీపీకి అభ్యర్థి పనబాక లక్ష్మి కాకపోతే మరెవరున్నారు? బీజేపీ ఏం చేయబోతోంది? జనసేన విడిగా పోటీ చేస్తుందా బీజేపీతో కలిసి పనిచేస్తుందా?... అనే అంశాల చుట్టూ కేంద్రీకృతమైంది.

2021, మార్చి 29, సోమవారం. నెల్లూరు నగరం నామినేషన్ ఘట్టంతో కళకళలాడింది. ఆ నామినేషన్ వేసింది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గురుమూర్తి. మీడియా రంగ ప్రవేశం చేసి 'ప్రజలకు మీరు చేస్తున్న విజ్ఞప్తి, ప్రజలకు మీరివ్వాలనుకుంటున్న సందేశం ఏమిట'ని అడిగింది. గురుమూర్తి సమాధానం కోసం యావత్తు ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం చెవులు రిక్కించుకుని వినే ఉంటుంది. చెయ్యి తిరిగిన కవి పద్యం రాసినంత అలవోకగా హామీల వర్షం కురిపించడానికి గురుమూర్తి నాలుక తిరిగిన రాజకీయ నాయకుడు కాదు. పేషెంట్‌లకు వైద్యం చేసే డాక్టర్. డాక్టర్ కదా పేషెంట్ నాడి పట్టుకున్నంత సులువుగా ప్రజల నాడి తెలుసుకోగలుగుతాడా అంటే...సందేహమే సమాధానం. అయినా ఇప్పుడు ఏ డాక్టర్ కూడా పేషెంట్ నాడి పట్టుకుని వైద్యం చేయడం లేదు. కాబట్టి గురుమూర్తికి కూడా ప్రజల నాడి తెలుసుకోవాల్సిన అవసరం ఉండకపోవచ్చు. గురుమూర్తి ఆ ప్రయత్నం చేస్తున్నట్లు కూడా లేదు. పార్లమెంటులో తిరుపతి ప్రజలకు ప్రాతినిధ్యం వహించాల్సిన బాధ్యత తన భుజాల మీదకు చేరబోతోందనే అవగాహన ఉంది. ఆయన మాటకు ముందు ఒక 'జగనన్న', మాట తర్వాత ఒక జగనన్న అనడం చూస్తుంటే పార్టీలో మనగలగడానికి అవసరమైన నైపుణ్యాన్ని త్వరగానే సాధించినట్లున్నాడు. గురుమూర్తికి ఫిజియోథెరపీ పాఠాలు చెప్పిన ప్రొఫెసర్ మాధవి మాటలను బట్టి చూసినా కూడా గురుమూర్తి మంచి అనుచరుడు కాగలడే కానీ నాయకుడు కావడం కష్టమే. 'జగనన్న పాలనలో అందుకున్న ఫలాలకు ప్రతిగా తనను గెలిపించమని ప్రజలను కోరుతాన'ని చెప్పడం మాత్రం విశ్లేషకుల విమర్శలకు తావిచ్చే సమాధానమే.

గురుమూర్తి ఎన్నికల సందర్భంగా మీడియాతో మాట్లాడేటప్పుడు... తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో తాను గుర్తించిన సమస్యలను ప్రస్తావించ లేదు. సమస్యల పట్ల సమగ్రమైన అధ్యయనం, అవగాహన లేకపోయినప్పటికీ 'తిరుపతి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని' మొక్కుబడి మాట కూడా మాట్లాడలేదు. తాను తిరుపతి లోక్‌సభ నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన అంశాలను పార్లమెంటులో లేవనెత్తుతానని కానీ, వాటి పరిష్కారానికి చట్టాలు చేయడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తానని కానీ, నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కానీ చెప్పడం లేదు. మెజారిటీ బాధ్యత కూడా స్థానిక నాయకుల భుజాల మీదనే ఉండడంతో గురుమూర్తి ఆ విషయంలో కూడా నిమ్మకు నీరెత్తినంత నిశ్చింతగానే కనిపిస్తున్నారు.

### రెండవ స్థానం ఎవరిది?

***2019లో వైసీపీ అభ్యర్థి బల్లి దుర్గాప్రసాద్‌కి ఏడు లక్షలకు పైగా ఓట్లు రాగా టీడీపీ అభ్యర్థి పనబాక లక్ష్మికి దాదాపు ఐదు లక్షల ఓట్లు వచ్చాయి. నోటాకు పాతిక వేలు రాగా కాంగ్రెస్, బీజేపీలు నోటాకంటే తక్కువ ఓట్లతో సరిపెట్టుకున్నాయి. ఇప్పుడు బీజేపీ తన బాణాన్ని రెండవ స్థానం మీద గురి పెట్టింది. మహిళల ఓట్లు పనబాక లక్ష్మి వైపు ఏకతాటి మీదకు రానివ్వకుండా బీజేపీ రత్నప్రభను తెరమీదకు తెచ్చింది. ఉన్నత విద్యావంతుడు అనే ట్యాగ్‌లైన్ వైసీపీ అభ్యర్థికి ఉండడంతో చదువుకున్న ఓటర్లు గురుమూర్తి మీద మొగ్గకుండా నియంత్రించడానికి కమలనాథులు ఏకంగా ఐఏఎస్‌నే తెర మీదకు తెచ్చినట్లున్నారు.***

## రత్నప్రభకు వైసీపీ ప్రచారం

మరో అభ్యర్థి రత్నప్రభ ఐఏఎస్ అధికారిగా బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించిన మహిళ. ఆమె కూడా అదే రోజు నామినేషన్ వేశారు. ఆమె జగన్ పాలన తీరును ప్రశంసిస్తూ గతంలో చేసిన ట్వీట్‌లను హైలైట్ చేయడం ద్వారా ఏం సాధించాలనుకుంటున్నదో వైసీపీ శ్రేణులకే తెలియాలి. వైఎస్ఆర్ హయాంలో మన రాష్ట్రంలో పని చేసి, కర్నాటకలో చీఫ్ సెక్రటరీగా 2018లో రిటైర్ అయిన రత్నప్రభ గురించి అధికారులకు తప్ప సామాన్య ప్రజానీకానికి పెద్దగా తెలియదు. ఆమె మీద సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ, ఆమె గతంలో చేసిన పోస్టులను ఇప్పుడు సర్క్యులేట్ చేస్తూ రత్నప్రభకు బీజేపీకంటే వైసీపీ శ్రేణులే పెద్ద ప్రచారం కల్పిస్తున్నాయి. ఒకరకంగా ట్రోలింగ్ అనే చెప్పాలి. 'ప్రభుత్వ చర్య ప్రజలకు మేలు చేసేది అయితే ప్రతిపక్షం కూడా ప్రభుత్వాన్ని ప్రశంసించాల'నే రాజనీతి సూత్రాన్ని వైసీపీ శ్రేణులు మర్చిపోవడం కావచ్చు లేదా తెలియకపోవడం కూడా కావచ్చు. ఇన్నింటినీ ఎదుర్కొంటూన్న రత్నప్రభ మాటల్లో స్థిరత్వం కనిపిస్తోంది. ప్రశ్నల బాణాలు ఎదుర్కోవడంలో పరిణతి కనిపిస్తోంది. జనసేన మద్దతు గురించి ఎదురవుతున్న ప్రశ్నకు పవన వీచిక తన వైపేనని తడుముకోకుండా బదులిస్తోంది. అన్నింటికంటే మిన్నగా ఈ ప్రయత్నంలో గెలుపు తీరం చేరడం కష్టం అని తెలిసీ బరిలో నిలవడంలో స్థితప్రజ్ఞత కూడా కనిపిస్తోంది. తిరుమల వేంకటేశ్వరుడి మీద భారం వేసి బరిలో నిలిచారామె.

## ప్రభుత్వాన్ని నిలదీస్తాను

టీడీపీ విషయానికి వస్తే... పనబాక లక్ష్మి పరిస్థితి భారతంలో కర్ణుడిని తలపిస్తోంది. కర్ణుడు తనకు తానుగా వీరుడే, కానీ ప్రజాభిమానం కోల్పోయి, విజయతీరానికి చేరలేని కౌరవపక్షంలో ఉండడంతో పరాజయాన్ని మూటకట్టుకోక తప్పలేదు. ఆమె కాంగ్రెస్‌పార్టీలో ఉన్నప్పుడు పదవులు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. ఒక పార్టీలో ఎక్కువ కాలం కొనసాగి ఆ పార్టీ ముద్రను వేయించుకున్న నాయకులకు... తమ పార్టీ సంక్షోభంలో ఉన్న సమయంలో పార్టీ కోసం ఎన్నికల బరిలో నిలవక తప్పని పరిస్థితులు ఉంటాయి. అది తమకు గుర్తింపునిచ్చిన పార్టీకి నైతిక అండనివ్వడం అన్నమాట. పనబాక మాత్రం కాంగ్రెస్ పార్టీ కోసం త్యాగం చేయాల్సిన సమయంలో 'త్యాగం కోసం' ఆ పార్టీలో కొనసాగడానికి మనసొప్పుకోక టీడీపీలోకి మారినట్లున్నారు. ఆమె పార్టీ మారడం వెనుక అంతకంటే మరో కారణం ఏదీ కనిపించడం లేదు. ఇప్పుడు ఆమెకు టీడీపీ కోసం త్యాగం చేయాల్సిన సంకట స్థితి ఎదురైంది. ఆమెకు 2019 ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు గెలవగలమనే నమ్మకం కానీ, గెలవలేకపోతామా అనే ఆశ కానీ ఉండి ఉంటుంది. ఇప్పుడది లేకనే బరిలో నిలవాల్సి రావడం ఎవరికైనా విషమ పరీక్ష అనే చెప్పాలి. తిరుపతి ఎంపీగా గెలిచిన బల్లి దుర్గాప్రసాద్ మరణం... విధి తనతో ఆడుకుంటున్న వింత నాటకం అని సమాధానం చెప్పుకోవడం మినహా మరే సమాధానమూ దొరకదు. ఆమె 2012, మార్చి నెల, 24 బుధవారం నాడు నామినేషన్ వేశారు. ఆ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ 'వైఎస్ఆర్‌సీపీ పార్లమెంట్‌లో గొంతెత్తలేకపోతోంది, రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ కోసం పార్లమెంట్‌లో పోరాడతానని, బీజేపీ దాగుడుమూతలకు తెరదించి ప్రభుత్వాన్ని నిలదీస్తాన'ని గట్టిగా స్వరాన్ని వినిపించారు. ఇప్పుడు ఆమెకు వెన్నంటి ఉన్న అండ, ఎన్నటికీ వీడని మకుటం 'కేంద్ర మాజీ మంత్రి' అనే హోదా. ఇకపై కూడా అదే కావచ్చు.

➤ భారత్ అమ్ములపొదిలో అపూర్వమైన అస్త్రాలు

# అద్భుత విజయాల సారథి.. మన సతీష్‌రెడ్డి

***దే**శ రక్షణ రంగంలో మన జిల్లా వాసి, ప్రఖ్యాత శాస్త్రవేత్త గుండ్రా సతీష్‌రెడ్డి దేశ రక్షణ, పరిశోధన సంస్థ(డిఆర్‌డిఓ) అధినేతగా భారత్ అమ్ములపొదిలోకి అపూర్వమైన అస్త్రశస్త్రాలను చేకూర్చడం ద్వారా ఆయన దేశప్రజలందరి అభినందనలందుకుంటున్నారు. సతీష్‌రెడ్డి నేతృత్వంలో డిఆర్‌డిఓ సాధిస్తున్న విజయాలు మన జిల్లాకేకాక, దేశానికే గర్వకారణం. ఒక్క మాటలో చెప్పాలంటే సతీష్‌రెడ్డి దేశరక్షణ రంగానికి లభించిన ఒక అనర్ఘరత్నం. దేశానికి ఇంతగా సేవలు చేస్తున్న మన సతీష్‌రెడ్డికి జిల్లా ప్రజలందరి తరఫునా హాట్సాఫ్ చెప్తోంది..'లాయర్'!...*





గత మూడేళ్ళుగా డిఆర్‌డిఓ సాధించిన విజయాలు, ఆ సంస్థ సారధ్యంలో జరిగిన కొత్త కొత్త పరిశోధనలు చూస్తే ఎంతో అబ్బురమనిపిస్తుంది. కేవలం మూడేళ్ళలోనే ఎన్నో అధునాతనమైన క్షిపణులు రూపొందించడం డిఆర్‌డిఓ శాస్త్ర సాంకేతిక సామర్థ్యాలకు ఒక మచ్చుతునక. ఆకాశంలోనూ, సముద్రంలోనూ, నేలమీదా ఎక్కడైనా సరే తనకు తనే సాటి అనిపించుకునే రీతిలో ఎన్నో అరుదైన, విశిష్టమైన ఆయుధాలను సమకూర్చి దేశ రక్షణకు సమర్పిస్తోంది డిఆర్‌డిఓ. వేలాది మంది శాస్త్రవేత్తల నిరంతర కృషితో పాటు అందరినీ సమన్వయం చేసుకుంటూ, దేశ భద్రతకు ఎంతో కీలకమైన ఆ సంస్థను తన ప్రతిభాపాటవాలతో మరింతగా అభివృద్ధి చేస్తూ అందరికీ మార్గదర్శనం చేస్తూ ముందుకు సాగుతున్నారు సతీష్‌రెడ్డి. ఆయన సారధ్యంలో దేశానికి ఎంతో అమూల్యమైన ఆయుధ సంపత్తిని అందజేస్తోంది డిఆర్‌డిఓ. సముద్రగర్భంలో ఎవరికీ కనిపించకుండా తిరిగే శత్రువుల సబ్‌మెరైన్లను సైతం గుర్తించి ధ్వంసం చేసే క్షిపణులు, గగన తలంలోనూ, సాగరంలోనూ వీర విహారంచేసే విమాన, నౌకా రంగాలకూ తిరుగులేని అధునాతన ఆయుధాలు చేకూర్చి శత్రుదుర్భేధ్యమైన టార్పెడోలు, రాడార్లు వంటివాటిని ఎన్నిటినో తయారుచేసి భారతదేశ రక్షణ రంగాన్ని ఎంతో బలీయంగా రూపొందించడంలో డిఆర్‌డిఓ చేస్తున్న కృషి అనన్య సామన్యమనే చెప్పకతప్పదు. రేయింబవళ్ళు దేశసరిహద్దులను కంటికి రెప్పలా కాపాడే వీరజవాన్లకు తోడుగా, దేశంలో పోలీసు వ్యవస్థ మరింత బలోపేతంగా ఉండేందుకు వీలుగా ఎన్నో అధునాతన ఆయుధాలను సమకూర్చి డిఆర్‌డిఓ తన దేభక్తిని చాటుకుంటోంది. స్వదేశీ రక్షణ పరిజ్ఞానంతో, అమేయమైన సాంకేతిక విజ్ఞానంతో రూపొందుతున్న ఈ ఆయుధాలు, మన దేశ శాస్త్రవేత్తల నిరుపమాన ప్రతిభాపాటవాలకు నిదర్శనం.

ఈ మూడేళ్ళ అత్యంత స్వల్పకాలంలోనే డిఆర్‌డిఓ తయారుచేసిన అత్యంత ఆధునిక రక్షణ పరికరాల జాబితా ఎంతో ఉంది. సుమారు 79 రకాల అధునాతన సాంకేతిక యుద్ధ పరికరాలను డిఆర్‌డిఓ రూపొందించింది. యాంటీషిప్ మిసైల్స్, సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్స్, ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్, రాడార్స్, టోర్ఫడోస్ వంటి రక్షణ క్షిపణులు తయారు చేయడంలో డిఆర్‌డిఓ తనకు తనే సాటి అనిపించుకుంటూ దేశ రక్షణ రంగానికి అమూల్యమైన సేవలందిస్తూ ఉంది.

ఇంతటి బృహత్తరమైన గురుతర బాధ్యతను అత్యద్భుతంగా నిర్వహిస్తూ, దేశాన్ని రక్షణరంగంలో ఎంతో బలోపేతం చేస్తున్న డిఆర్‌డిఓ సతీష్‌రెడ్డిని మన దేశాధినేతలు, శాస్త్రవేత్తలే కాక దేశ ప్రజలందరూ మనసారా అభినందిస్తున్నారు. భవిష్యత్‌లో మన సతీష్‌రెడ్డి మరిన్ని విజయాలు సాధించాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

## ఎన్నికల కమిషనర్‌గా 'నీలం సాహ్ని'

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కమిషనర్(ఎస్ఇసి)గా నీలం సాహ్ని ఏప్రిల్ 1వ తేదీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొత్త ఎస్ఇసిగా నియమితులైన ఆమెకు కమిషన్ కార్యదర్శి కన్నబాబు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి దాకా ఏపి ఎన్నికల కమిషనర్‌గా ఉన్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ పదవీ కాలం మార్చి 31వ తేదీతో ముగిసిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నీలం సాహ్ని నియమితులయ్యారు.

## టీకాపై అపోహలు వద్దన్న ముఖ్యమంత్రి జగన్

**రా**ష్ట్రంలో కరోనా మహమ్మారి వ్యాధి మళ్ళీ విజృంభిస్తున్న నేపథ్యంలో కరోనా వ్యాధి నివారణకు వ్యాక్సిన్(టీకా) ఒక్కటే దివ్యౌషధమని, టీకాపై ఎలాంటి అపోహలు వద్దని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ఈ నెల 1వ తేదీ గురువారం సీఎం జగన్ తన సతీమణి వైయస్ భారతితో కలిసి గుంటూరు భారత్ పేటలోని 140వ వార్డు సచివాలయానికి వెళ్లి కోవిడ్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కేంద్ర మార్గదర్శకాల ప్రకారం వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతోందని, మూడు నెలల్లో రాష్ట్రంలో ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. వ్యాక్సినేషన్‌పై వాలంటీర్లు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తారని, ఇంటింటికి వెళ్లి 45ఏళ్లు దాటిన వారి వివరాలను సేకరించి వారికి వ్యాక్సిన్ వేయించేవిధంగా అవగాహన కల్పిస్తారని చెప్పారు. అందరూ వ్యాక్సిన్ వేయించుకుని కరోనా మహమ్మారి వ్యాధి బారిన పడకుండా ఉండాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com